నవతెలంగాణ
నమ్మిన తెలుగు దినపత్రిక
1
వరంగల్
శుక్రవారం నవంబర్ 08, 2024

సీపీఐ(ఎం) బలోపేతానికి కృషి చేయాలి

జిల్లా కమిటీ సభ్యులు భూక్య సమ్మయ్య

పార్టీ గ్రామ నూతన కార్యదర్శుల ఎన్నిక

నవతెలంగాణ-నల్లబెల్లి

మండలంలో సీపీఐ(ఎం)ను బలోపేతం చేయాలని జిల్లా కమిటీ సభ్యులు భూక్య సమ్మయ్య అన్నారు. మండలంలోని రుద్రగూడెం, మూడుచెక్కలపల్లి, కొండాపురం గ్రామాల్లో నూతన గ్రామ కార్యదర్శులను ఎన్నుకున్నారు. రుద్రగూడెం గ్రామ కార్యదర్శిగా రంగారపు లింగయ్య, మూడుచెక్కలపల్లి కార్యదర్శిగా ఇస్లావత్ రవి, కొండాపురం గ్రామ కార్యదర్శిగా రేటు సాంబయ్య నియమితులు అయినట్లు జిల్లా కమిటీ సభ్యులు, మండల కార్యదర్శి కడియాల మనోహర్ తెలిపారు. అనంతరం భూక్య సమ్మయ్య మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగం, పేదరికం, ఆకలి, స్త్రీలపై అఘాయిత్యాలు, దోపిడీలు ఏవీ మారలేదని,ప్రతి సమస్యకు సమిష్టి పోరాటాలే మార్గమని, దానికి కమ్యూనిస్టు పార్టీలు ముందుంటాయని తెలిపారు. ప్రజలు ప్రశ్నించే పార్టీలను పక్కకు పెట్టినంతకాలం బతుకులకు భద్రతా కరువై వ్యసనాలకు అలవాటు పడి ఆత్మహత్యలకు దారితీస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు కూలి సంఘం నాయకులు కడియాల వీరాచారి, నల్లబెల్లి కార్యదర్శి బొడిగె సమ్మయ్య, విస్లావత్ రవి, కట్ల రాములు, ఖల్నాయక్, ఈర్ల దేవేందర్, బయ్య రమేష్, పాల్గొన్నారు.



విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

నవతెలంగాణ-పర్వతగిరి

విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని మండల విద్యాశాఖ అధికారి గాయపు లింగారెడ్డి, పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు అల్లందాసు భిక్షపతి తెలిపారు. మండలంలోని కొంకపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం డ్రగ్స్ మహమ్మారి వల్ల కలిగే నష్టాల గురించి విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సును ఉద్దేశించి విద్యార్థులకు ముఖ్యమైన సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులు అని, విద్యార్థులు మాదకద్రవ్యాల జోలికి వెళ్లకూడదని, వాటికి ఎప్పుడూ బానిసలు కావద్దని సూచించారు. గంజాయి, కల్తీకల్లు, ఫాన్ మసాలాలు, పాన్ పరాగ్, గుట్కా, అంబర్, సారాయి మొదలైన మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైనా అమ్మినా ఉపయోగించిన, ఉపయోగించడానికి ప్రోత్సహించిన, చట్టరీత్యా నేరమని సూచిస్తూ, అలాంటి వారు ఎవరైనా మీ దృష్టికి వస్తే, 1908 టోల్ ఫ్రీ నెంబర్ కి సమాచారం అందించాలని సూచించారు.ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జంపాల లింగమూర్తి, సిహెచ్ కష్ణమూర్తి,డి విశ్వనాథం, ఏ వెంకటేశ్వర్లు, రఘు ప్రసాద్, లలిత పాల్గొన్నారు.



విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం

'జయముఖి'లో రెండ్రోజుల టెక్నోజిట్స్ ప్రారంభం

నవతెలంగాణ-చెన్నారావుపేట

విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య అవసరమని కళాశాల అకాడమిక్ డైరెక్టర్ హమీద్‌పాషా అన్నారు. జయముఖీ అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ జయముఖి స్టూడెంట్ చాప్టర్ ఆధ్వర్యంలో రెండు రోజుల టెక్నో జిట్స్ ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జయముఖి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జానకి, కళాశాల యాజమాన్యం చంద్రశేఖర్‌రెడ్డి, కళాశాల విభాగ అధిపతులు, ప్రొఫెసర్ రామకృష్ణరెడ్డి పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ..విద్యార్థులు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే ప్రాజెక్టులను తయారు చేయాలన్నారు. వివిధ కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా విద్యార్థుల సృజనాత్మక బయట పడుతుందని తెలిపారు. క్రమశిక్షణ తో కూడిన విద్య విద్యార్థుల అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు.అనంతరం విద్యార్థులు పలు ఎక్జిబిట్స్ ,పేపర్ ప్రెసెంటషన్, క్విజ్, బస్ స్మాష్, కోడ్ హ్యాకర్,పిక్చర్ విశ్వలిజషన్, కోడ్ ఫేజ్లిల్, వివిధ విభాగాల ప్రాజెక్ట్ ఎక్స్‌పోలను ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో జయముఖి కళాశాల యాజమాన్యం చంద్రశేఖర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ జానకి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, డీన్ అకాడమిక్ హమీద్ పాషా, సియస్ఈ హెడ్ డాక్టర్ జోసెమేరీ, డాటా సైన్స్ హెడ్ డాక్టర్ గౌతమి, సియస్ఎమ్ ప్రొఫెసర్ వరుణ్, డాక్టర్ జవహర్,ప్రొఫెసర్ రామకృష్ణరెడ్డి, పున్నం చందర్, విష్ణు, టిపిఓ శ్రీరామ్, కళాశాల వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం

ముగిసిన పాఠశాల స్థాయి సైన్స్ టాలెంట్ పరీక్ష పోటీలు

నవతెలంగాణ-నెక్కొండ

పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచేందుకే తెలంగాణ సమగ్ర శిక్ష సహకారంతో జన విజ్ఞాన వేదిక (జెవివి)ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబురాలు-2024 నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు బూర్గుపల్లి శ్రవణ్ కుమార్, మండల కన్వీనర్ పాక శ్రీనివాస్ తెలిపారు. మండలంలో చెకుముకి సైన్స్ సంబురాలలో భాగంగా గురువారం మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు, ఆశ్రమ పాఠశాలలో పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించినట్లు తెలిపారు. మండలంలోని తొమ్మిది జిల్లా పరిషత్, ఐదు ప్రైవేటు, టిఎస్ఆర్ఎస్ ,టిఎస్ఎంఎస్ , కేజీబీవీ పాఠశాలల్లో 8, 9 ,10 వ తరగతి చదువుతున్న ఆంగ్ల మాధ్యమ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారన్నారు. పాఠశాల స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహణకు 1200 ప్రశ్న పత్రాలు జెవివి నుండి పంపిణీ చేసినట్లు చెప్పారు. 8, 9, 10 తరగతిలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులతో ఒక్కో పాఠశాల నుండి ముగ్గురు విద్యార్థులతో కూడిన బందం ఈనెల 21న మండల స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటారని, విద్యార్థులలో సైన్స్ పట్ల ఆసక్తిని అభిరుచిని పెంచేందుకు, శాస్త్రీయ వైఖరులను పెంపొందించేందుకు సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. ఈ పోటీలలో విద్యార్థులు మండల స్థాయిలో పాల్గొని జిల్లాకు అర్హత సాధించేలా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సైన్స్ టీచర్లు దృష్టి సారించాలని కోరారు. అలాగే మండలంలోని అప్పలరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం చెకుముకి సైన్సు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు రవీంద్రనాథ్ ప్రశ్నాపత్రాన్ని ఆవిష్కరించారు. 8,9,10 తరగతుల 26 మంది ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గీత, యాకయ్య, భూలక్ష్మి, వెంకట్రాజం, దయాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

మండల వైద్యాధికారి డాక్టర్ వి.ఉదయ్‌రాజ్

నవతెలంగాణ-పర్వతగిరి

ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత ను పాటించాలని మండల వైద్యాధికారి డాక్టర్ ఉదయ్‌రాజ్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో బీసి వసతి గృహంలో గురువారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చర్మ వ్యాధులు, జ్వరం, దగ్గు, జలుబుతో బాధపడుతున్న వారికి, ఇతర అనారోగ్య సమస్యలు ఉన్న 70మందికి పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత తప్పకుండా పాటించాలని పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం ఈస్టర్, హేమలత,ఆశా కార్యకర్తలు, హాస్టల్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు వరుణ్‌సందేశ్ ఎంపిక

నవతెలంగాణ-నర్సంపేట



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు నర్సంపేటకు చెందిన ఎట్టి వరుణ్‌సందేశ్ ఎంపికైనట్లు స్టేడియం కబడ్డీ ఇన్‌చార్జి కోచ్ యాట రవికుమార్ తెలిపారు. ఈ నెల 5న హనుమకొండలోని జేఎన్ఎస్‌లో నిర్వహించిన వరంగల్ జిల్లా స్థాయి అండర్-14ఏండ్ల విభాగం కబడ్డీ పోటీల్లో వరుణ్‌సందేశ్ జిల్లా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించారన్నారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనపర్చి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైయ్యాడని చెప్పారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటున్న వరుణ్‌సందేశ్‌ను జిల్లా యువజన, క్రీడల అధికారి సత్యవాణి, వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ పుల్లూరి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ఎస్టీఎఫ్ సెక్రటరీ సోనబోయిన సారంగపాణి, పీఈటీలు అభినందనలు తెలిపారు.

స్కావెంజర్ల వేతనాల చెల్లించండి మహాప్రభో !

మూడు నెలలుగా సేవకులకు అందని వేతనాలు

పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీలో జమ కాని వైనం

ఆర్థిక ఇబ్బందుల్లో ప్రభుత్వ పాఠశాలల స్వీపర్లు

నవతెలంగాణ-వరంగల్

రాష్ట్రవ్యాప్తంగా గత ప్రభుత్వ హయాంలో పాఠశాలలకు నిలిపివేసిన స్కావెంజర్లను మరల నియమించుకోవాలని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆగస్టులో ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పారిశుద్ధ్య సేవకులను నియమించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారులకు ఉత్తర్వులు జారీచేసింది. ఈ క్రమంలో సంబంధిత ప్రధానోపాధ్యాయులు పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించుకున్నారు. మూడు నెలలుగా పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్నప్పటికీ ఇప్పటివరకు ఒక్కపైసా వేతనం రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ప్రత్యేకంగా స్కూల్ ఫెసిలిటీ మెయింటెనెన్స్ గ్రాంట్‌ను పాఠశాలలోని విద్యార్థుల సంఖ్య ఆధారంగా విడుదల చేయాల్సి ఉండగా ఇప్పటివరకు విడుదల చేయలేదు. ఇతర పనులకూ వెళ్లలేక మూడు నెలలుగా అప్పులు తెచ్చి కుటుంబాలను పోషించుకుంటున్నట్టు స్కావెంజర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేతనాలపై నెలకొన్న సందిగ్ధత

ప్రభుత్వ పాఠశాలల్లో చాలా ఏండ్లుగా అటెండర్లు లేకపోవడం స్వీపర్ల కొరత అధికంగా ఉండటం, దాంతో పాటు పాఠశాల ప్రాంగణమంతా అపరిశుభ్ర వాతావరణం నెలకొని ఉంటుండటంతో కాంగ్రెస్ ప్రభుత్వం జీవో ఎంఎస్ నంబర్ 21, స్కూల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం డెప్ట్ 30 జులై 2024న, ఎస్‌పీడీఎస్, ఎస్-



ఎల్ఆర్ నంబర్ 2751/ఎస్ఎస్/సీడబ్ల్యూ/2024, 02ఆగస్టు 2024న విడుదల చేసింది. దాంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్కావెంజర్లను నియమించగా అప్పటి నుంచి పాఠశాల పరిసరాల్లో పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ, మొక్కల పెంపకం, తాగునీటి సౌకర్యం లాంటి పనులు సవ్యంగా సాగుతున్నాయి. అయితే సంబంధిత అధికారులు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకనుగుణంగా వారి వేతనాలు ఇవ్వాల్సి ఉండగా మూడు నెలలు గడుస్తున్నా వేతనాలు వేయకపోవడంతో స్వీపర్లు ఆర్థిక ఇబ్బందులతో మానసికంగా కుంగిపోతున్నారు. స్వీపర్ల వేతనాలపై ప్రధానోపాధ్యాయులకు కూడా సంబంధిత ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడంతో సందిగ్ధత నెలకొంది. ఏదేమనప్పటికీ అధికారులు ఇప్పటికైనా సత్వరమే ఈ విషయమై పరిశీలించి గత మూడు నెలల నుండి రావాల్సిన బకాయిలను చెల్లించేలా అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసముందని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు కోరుతున్నారు.

స్కావెంజర్లకు త్వరగా వేతనాలు అందించాలి

మూడు నెలల నుంచి స్కావెంజర్‌గా ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్నాను. ఇప్పటి వరకు వేతనాలు రాలేదు. ప్రభుత్వం స్కావెంజర్లకు వేతనాలు సకాలంలో అందజేయాలి.

ఎల్లయ్య, స్కావెంజర్, సంగెం

వేతనాల కోసం ఎదురు చూస్తున్నాం

ప్రభుత్వ పాఠశాలలో పారిశుద్ధ్య సేవకురాలుగా మూడు నెలల నుంచి పనిచేస్తున్నాను. ఇప్పటి వరకు వేతనాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం తక్షణమే వేతనాలు చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నాం.

: అనూష, పారిశుద్ధ్య సేవకురాలు, వరంగల్



రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థిని కీర్తన

నవతెలంగాణ-చెన్నారావుపేట

వరంగల్ ఓ సిటీలో నిర్వహించిన అండర్‌గీ17 ఖోఖో బాల, బాలికల పోటీల్లో మండలంలోని ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి రెడ్డబోయిన కీర్తన రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తేజావత్ జయ, వ్యాయామ ఉపాధ్యా యురాలు వీరగోని స్వప్న తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు తేజావత్ జయ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలు ఈ నెల 8,9,10 తేదీలలో ఖమ్మం జిల్లాలో జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ సునీత, పిన్నింటి బాలాజీరావు, ఉదయ్‌కుమార్, సిహెచ్ మాధవి, ఎల్ మొగిలి, కె.మాధవి, వర్దెల్లి సతీష్‌కుమార్, హంస రామకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ జాహెద్, క్రాఫ్ట్ టీచర్ చింతకింది ఇందిర పాల్గొన్నారు.

మేడపై గంజాయి పెంచుతున్న వ్యక్తి అరెస్ట్

నవతెలంగాణ-కాశిబుగ్గ

సులభంగా డబ్బు సంపాదించాలనే కోరికతో తన ఇంటి మేడ పైన గంజాయి మొక్కల పెంపకాన్ని గృహ పరిశ్రమగా ప్రారంభించిన ఓ వ్యక్తి చివరికి పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యారు. యాంటీ డ్రగ్స్ టీమ్ ఇంచార్జ్ ఇన్స్పెక్టర్ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని శివనగర్ ప్రాంతానికి చెందిన పల్లె బోయిన కుమార్ (60) సులభంగా డబ్బు సంపాదించడం కోసం తన ఇంటి మేడ పైన పూల కుండీల్లో గంజాయి మొక్కలను పెంచుతున్నాడు. గురువారం రైల్వే స్టేషన్‌లో తనిఖీలలో యాంటీ డ్రగ్స్ టీం పోలీసులకు పక్క సమాచారం రావడంతో పోలీసులు మత్తు పదార్థాలను పసిగట్టే పోలీస్ జాగిలాలతో మేడపైన గంజాయి మొక్కలను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఇంటి యజమానిని డ్రగ్స్ కంట్రోల్ టీం పోలీసులు, గంజాయి మొక్కలు పెంపకం చేపట్టిన నిందితున్ని మిల్స్ కాలనీ పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా యాంటీ డ్రగ్స్ టీమ్ ఇన్చార్జి ఇన్ ఇన్స్పెక్టర్ సురేష్ మాట్లాడుతూ వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మత్తు పదార్థాల నియంత్రణలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు గురువారం యాంటీ డ్రగ్స్ టీం, ఇంతెజార్‌గంజ్ పోలీసుల ఆధ్వర్యంలో వరంగల్ రైల్వేస్టేషన్‌లో పోలీస్ జాగిలంతో ముమ్మరంగా తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో భాగంగా పోలీసులు అనుమానస్పద ప్రయాణికుల సామానుతో పాటు బ్యాగులను పోలీస్ జాగిలంతో తనిఖీ చేయించినట్లు తెలిపారు. ఈతనిఖీలలో యాంటీ డ్రగ్స్ టీం ఇన్స్పెక్టర్ సురేష్ తోపాటు ఆర్ఐ శివకేశవులు, ఆర్ఎస్ఐ పూర్ణచంద్రారెడ్డి, ఎస్సై చాంద్ పాషా, ఏఎస్ఐ సాంబయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్‌గా మామునూరు

ఎయిర్‌పోర్ట్‌కు భూసేకరణ నిమిత్తం రైతులు, స్థానికులతో చర్చించిన మంత్రి కొండా సురేఖ

నవతెలంగాణ-వరంగల్

అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్‌గా మామునూరును తీర్చి దిద్దేందుకు అడుగులు ముందుకు పడుతున్నాయని అటవీ పర్యావరణ, దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గురువారం వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, పరకాల, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదలతో కలిసి మామునూరు ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు సంబంధించిన భూసేకరణ నిమిత్తం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా గాడిపల్లి గుంటూరుపల్లి, నక్కలపల్లి గ్రామస్తులతో మంత్రి సమావేశమై విమానాశ్రయ ఏర్పాటుకు కావాల్సిన 253 ఎకరాల భూసేకరణ నిమిత్తం రైతులతో మాట్లాడారు. ఎయిర్‌పోర్ట్ వస్తే స్థానికుల జీవితాలు ఎలా మెరుగుపడతాయో సోదాహరణంగా వివరించి, వారిని ఒప్పించారు. ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు తమ అమూల్యమైన భూములు అప్పగిస్తున్న రైతులకు మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లిస్తామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ భూమి కోల్పోతున్న 233 మంది రైతులు, ప్లాట్ల యజమానులతో చర్చించి వారి అభిప్రాయాల మేరకు ఇతర భూమి కేటాయించి, వారు కోరిన విధంగా మౌలిక సదుపాయలైన రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, ఇతర సదుపాయాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు.

యునెస్కో గుర్తింపు పొందిన రామప్పతో పాటు, భద్రకాళి వెయ్యి స్తంభాల ఆలయం, వరంగల్ కోట కాకతీయ కట్టడాలు, మెగా టెక్స్టైల్ పార్క్ అవసరాలు, భవిష్యత్ పరిశ్రమల అవసరాలకు



అనుగుణంగా మామునూరు ఎయిర్‌పోర్ట్‌ను అంతర్జాతీయ విమానాశ్రయంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రయాణికుల సర్వీసులతో పాటు కార్గో సర్వీసులు అందించే దిశగా ఎయిర్‌పోర్టు అభివృద్ధి చేస్తామన్నారు. హైదరాబాద్ విమానాశ్రయానికి 150కి.మీల దూరంలో మరో వాణిజ్య విమానాశ్రయం ఏర్పాటు నిబంధనల మేరకు కుదరదని చెప్పినా, సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని, జీఎంఆర్ సంస్థను ఒప్పించి మామునూరు ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు మార్గం సుగమ చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రి సురేఖ కృతజ్ఞతలు తెలిపారు. ఎయిర్ పోర్టు ఏర్పాటుకు భూములు అప్పగించేందుకు ఒప్పుకున్న రైతులు, స్థానిక ప్రజలకు మంత్రి సురేఖ ధన్యవాదాలు తెలిపారు. రైతులకు మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించేందుకు కావాల్సిన నిధులు, రైతులకు కేటాయించే స్థలాలను పూర్తి స్థాయిలో మ్యాపింగ్ చేసి మౌలిక సదుపాయాల కల్పనకు, పరిహారం చెల్లింపుకు సమగ్ర నివేదికను రూపొందించి మంజూరి నిమిత్తం ప్రభుత్వానికి పంపాలని జిల్లా కలెక్టర్‌ను మంత్రి సురేఖ ఆదేశించారు. వరంగల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ చారిత్రాత్మక వరంగల్ నగరాన్ని అన్ని రంగాల అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారని, ముఖ్యంగా విమానాశ్రయం ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకొంటున్నారని అన్నారు.విమానాశ్రయం ఏర్పాటుతో వరంగల్ మరింత అభివద్ధి చెందుతుందన్నారు. విమానాశ్రయం ఏర్పాటుకు



రైతులు అమూల్యమైన భూమిని త్యాగం చేయడం సంతోషదాయకమని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముఖ్యమంత్రి ద్వారా కావాల్సిన నిధులు మంత్రి కొండా సురేఖతో కలిసి మంజూరు చేయిస్తామని అన్నారు.

అనంతరం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ వరంగల్‌లో విమానాశ్రయం ఏర్పాటుతో వరంగల్ రూపు రేఖలు మారబోతున్నాయని అన్నారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ విమానాశ్రయం ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, సహకరించి భూములను ఇస్తున్న రైతులకు కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ భూమి సర్వే చేసి పూర్తిగా మ్యాపింగ్ చేస్తామని ప్రస్తుతమున్న ధరలు, కోరుతున్న ధరలు, కావాల్సిన నిధులతో కూడిన సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గుండు చందన పూర్ణచందర్, ఈదురు అరుణ విక్టర్, చింతాకుల అనిల్, సురేష్ జోషి, బైరబోయిన ఉమా దామోదర్, భోగి సువర్ణ సురేష్, ముష్కమల్ల అరుణ సుధాకర్, ఓని స్వర్ణలత భాస్కర్, సోమిశెట్టి ప్రవీణ్, పల్లం పద్మ రవి, పుర్ఖాన్, ఆర్ అండ్ బీ, ఎస్ ఈ నాగేందర్ రావు, ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, తహసీల్దార్ నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కండ్లు



- రాష్ట్రంలో పదేండ్లు నిరంకుశ పాలన కొనసాగింది

- నేడు ప్రజాపాలన కొనసాగుతుంది

- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-రాయపర్తి

రాష్ట్ర ప్రభుత్వానికి అభివృద్ధి సంక్షేమ రెండు కండ్లవంటివి అని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పెర్కవేడు గ్రామం నుంచి అన్నారం షరీఫ్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో నిరంతరం ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి కొనసాగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంబ్బండ వర్గాలకు మంచి చేస్తుంది అని తెలిపారు. మరో 20ఏళ్ల రాష్ట్రాన్ని పాలించే సత్తా కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉందని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడానికి శ్రమిస్తుందన్నారు. రాజకీయ కురవద్ధులు అని చెప్పుకు తిరిగేవారు పాలకుర్తి నియోజకవర్గం అభివృద్ధిని మరచి నిరంకుశ పాలన కొనసాగించారని వ్యాఖ్యానించారు. పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ రథసారథి ఝాన్సీరెడ్డి, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి కొనసాగిస్తున్న పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఉపోద్ఘాటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కడియం కావ్య, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రు నాయక్, అదనపు కలెక్టర్ సంధ్య రాణి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ కిషన్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హమ్య నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, మండల నాయకులు కష్ణమాచార్యులు, మాచర్ల ప్రభాకర్, రెంటాల గోవర్ధన్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారు అదుపు తప్పి బోల్తా : తప్పిన ప్రమాదం

నవతెలంగాణ-నల్లబెల్లి

మండలంలోని రుద్రగూడెం గ్రామ మూలమలుపు జాతీయ రహదారి 365పై గురువారం ప్రమాదవశాస్తూ అదుపుతప్పి కారు బోల్తా పడి నుజ్జురుజ్జున సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా వెంకటాపురం గ్రామానికి చెందిన కనకపల్లి గణేష్, అతని స్నేహితులు నర్సంపేటకు వెళ్తుండగా రుద్రగూడెం గ్రామ శివారు మూలమలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారు ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
హనుమకొండ
శుక్రవారం | నవంబర్ 8, 2024 | www.navatelangana.com

నాగారం చెరువును పరిశీలించిన జిల్లా కలెక్టర్



నవతెలంగాణ-హసన్‌పర్తి

హసన్‌పర్తి మండలం నాగారం పెద్దచెరువును జిల్లా కలెక్టర్ ప్రావీణ్య గురువారం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువు లోని నీటిమట్టం, ఆయకట్టు వివరాలను అధికారులను అడిగి తెలుసుకన్నారు. పట్టణంలోని భద్రకాళి చెరువు ఆధునీకరణ పనులు చేపట్టనున్న దృష్ట్యా ఆ చెరువులోని నీటిని తొలిగించి హసన్‌పర్తి నాగారం పెద్ద చెరువులో పంపింగ్ చేయాల్సి ఉంటుంది. దీని మూలంగా చెరువు పై భాగంలో పంటలకు నష్టం కాకుండా, చెరువులోని చేపలు బయటకు వెళ్ళటానికి వీలులేకుండా ఉండడానికి, ఏమేరకు నీటిని స్టోరేజి చేయాల్సి ఉంటుందో కలెక్టర్ పరిశీలించారు. ఈ చెరువులో నీటిమట్టం పెరిగితే తలెత్తే సమస్యలను పరిశీలించాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చల్లా ప్రసాద్, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఎంపీఓ కర్ణాకర్ రెడ్డి, ఏఈఓ అనురాధ, ఆర్ఐ రాజేంద్రప్రసాద్, ఇంజనీరింగ్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు పింగిళి వెంకటరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు పోరెడ్డి మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరు నేత్రాలను కాపాడుకోవాలి

నవతెలంగాణ-శాయంపేట



మానవ శరీరంలోని సర్వేంద్రియాలలో నేత్రాలు అతి ముఖ్యమైనవని, ప్రతి ఒక్కరూ తమ నేత్రాలను కాపాడుకోవాలని లయన్స్ క్లబ్ జనరల్ సెక్రెటరీ, ఆప్తాల్మిక్ ఆఫీసర్ గుంటోజు వెంకన్న అన్నారు. మండలంలోని సూర్య నాయక్ తండాలో గుగులోతుజై, లయన్స్ విజన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 70 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఆపరేషన్లు అవసరమైన 50 మందిని గుర్తించి ఉచిత కండ్ల అద్దాలు పంపిణీ చేశారు.

రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

నవతెలంగాణ-హసన్‌పర్తి



రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వలక్ష్యం అని గ్రేటర్ వరంగల్ 65వ డివిజన్ కార్పొరేటర్ దివ్యారాణి అన్నారు. గురువారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 65వ డివిజన్ దేవన్నపేటలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజాపాలనలో రైతులందరికీ మేలు జరగాలని రుణమాఫీ మాఫీ చేసినట్లు పేర్కొన్నారు. రైతుపండించిన సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500లు బొనస్ ప్రకటించి ప్రజాప్రభుత్వం పూర్తిగా రైతుసంక్షేమం కోసం పనిచేస్తుందని తెలపడానికి ఇదే నిదర్శనమన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హసన్‌పర్తి పీఏసీఎస్ డైరెక్టర్ చుంచు విజేందర్, కాంగ్రెస్ గ్రామఅధ్యక్షులు మల్లేశం, మాజీ సర్పంచ్ చుంచు రవి, సీఈఓ సింగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

వర్గీకరణ తరువాతే నోటిఫికేషన్లు విడుదల చేయాలి

నవతెలంగాణ-శాయంపేట



ఎస్సీ రిజర్వేషన్ అమలయ్యాకే ఉద్యోగ నోటిఫికేషన్ లు జారీ చేయాలని మాదిగ మహాజన సోషలిస్ట్‌పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ మంద రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్య కర్తల సమావేశం స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు ముక్కెర ముఖేష్ అధ్యక్షతన నిర్వహించగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై తెలంగాణ రాష్ట్ర శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకుని వచ్చి రిజర్వేషన్ అమలు చేసే బాధ్యత మా మంత్రివర్గ సహచరులు అందరం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. నాలుగునెలలు గడిచినా ఎస్సీ వర్గీకరణపై సీఎం ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. అనంతరం మహాజన సోషలిస్ట్ పార్టీ మండల కన్వీనర్‌గా మామిడి భాస్కర్, ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్‌గా తుడుం వెంకటేశును నియమించినట్లు ప్రకటించి నియామక ఉత్తర్వులను వారికి అందజేశారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జన్ను దినేష్, ఏకు శంకర్, జిల్లెల్ల మురళి, గద్దల సుకుమార్, సురేంద్ర, దేవయ్య, సదయ్య, నగేష్, సుధాకర్, రమేష్, సాంబయ్య పాల్గొన్నారు.

శబరిమలకు రవాణా చార్జీలు ఇవే..

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వరంగల్ రీజియన్ నుండి అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం, శబరిమలకు ప్రత్యేక ఏసీ, నాన్ ఏసీ బస్సులుఏర్పాటు చేస్తున్నట్టు వరంగల్ రీజనల్ మేనేజర్ డి.విజయభాను తెలిపారు. శబరిమల బస్సులు మీరు కోరుకున్న ప్రదేశం నుండి మీరు దర్శించుకోవలసిన పుణ్యక్షేత్రాల మీదుగా నడిపించబడతాయని వీటిలో ఒక గురుస్వామితోపాటు ఇద్దరు వంటవాళ్ళు ఇద్దరు మణికంఠస్వాములు ఒక అటెండర్ ఫ్రీగా ప్రయాణించే అవకాశం కల్పిస్తామని వెల్లడించారు. ఈ శబరిమలై బస్సులు బుక్ చేసిన గురుస్వామికి ఉచితప్రయాణం ఒకటికంటే ఎక్కువ బస్సులు బుక్ చేసిన గురుస్వామికి రూ.300లు కమిషన్ ఇవ్వబడుతుందన్నారు. బస్సుల వారిగా చార్జీల వివరాలు రాజధాని ఏసి కిలోమీటర్‌కు రూ.77, సూపర్ లగ్జరీ 1 కిమీకు రూ.59, డీలక్స్ రూ.57లు, ఎక్స్‌ప్రెస్‌కు 1 కిలోమీటర్‌కు రూ.62లు ఛార్జీలుగా నిర్ణయించామని బస్సు అదనంగా వేచి ఉంటే 1 గంటకి రూ.300లుగా చార్జ్ చేయబడును. అయ్యప్ప భక్తులు అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆర్‌టిసి, బస్సులో సురక్షితప్రయాణం చేయవలసిందిగా కోరారు.

జాతీయ సదస్సుకు తరలిన వామపక్ష నాయకులు

నవతెలంగాణ-శాయంపేట

ఎంసీపీఐ(యు) ఆర్ఎంపిఐ ఆధ్వర్యంలో హైదరాబాదులోని బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య భవన్లో జరిగే జాతీయ సదస్సుకు గురువారం ఉస్మాన్, అస్రాఫ్, గట్ల రాజిరెడ్డి, దేవేంద్ర, కుసుమ రమేష్, రాజన్న, కొమురయ్య వెళ్లారు.

కేంద్రం దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలి

రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ-భీమదేవరపల్లి

కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్త కులగణల చేపట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు మండలంలోని గట్ల నర్సింగాపూర్ లో ఇటీవల మతి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు సామల లింగమూర్తి కుటుంబ సభ్యులను పరామర్శించారు అనంతరం కుల గణన చేస్తున్న సిబ్బందితో మాట్లాడారు బుద్ధి జ్ఞానం లేని వాళ్ళు రాహుల్ గాంధీ కులం అడుగుతున్నారని మండిపడ్డారు దేశవ్యాప్త కులగణన చేస్తే ఎవరి కులం ఏంటిదో తెలుస్తుందని అన్నారు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కుల విషయాన్ని ఎవరు అడగడం లేదన్నారు బిజెపి నాయకులు మాత్రమే రాహుల్ గాంధీ కులం గురించి ప్రస్తావన చేయడం మంచి పద్ధతి కాదన్నారు ఆయనతోపాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు

ప్రజల్లో పోలీసులు విశ్వసనీయతను కాపాడుకోవాలి

- పోలీసుపట్ల నమ్మకాన్ని పెంచాలి
- వరంగల్ సీపీ అంబర్‌కిషోర్‌ఝూ



నవతెలంగాణ-శాయంపేట

ప్రజలకు నమ్మకాన్ని పెంపొందించే విధంగా పోలీసులు విధులు నిర్వర్తించాలని, ప్రజల్లో విశ్వసనీయతను కాపాడుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝూ పోలీసు సిబ్బందికి సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం శాయంపేట పోలీస్‌స్టేషన్‌ను వరంగల్ పోలీస్ కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న పోలీస్ కమిషనర్‌కు పోలీస్ అధికారులు మొక్కలను అందజేసి స్వాగతం పలికారు. సాయుధ పోలీసుల గౌరవ వందనం చేశారు. స్టేషన్ పరిసరాలను సిపి పరిశీలించిన అనంతరం సిబ్బందికి పోలీస్ శాఖ మంజూరుచేసిన కిట్ ఆర్టికల్స్‌ను తనిఖీ చేశారు. స్టేషన్ రిసెప్షన్ సిబ్బంది పనితీరును పరిశీలించారు. బాధితుల నుండి వచ్చిన ఫిర్యాదులపై ఎలాంటిచర్యలు తీసుకోవడం జరిగిందని అధికారులను అడిగితెలుసుకున్నారు.అలాగే పెండింగ్ కేసులు, నిందితుల అరెస్ట్, రౌడీ షీటర్ల వివరాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు, కోర్టులో పెండింగ్‌లో వున్న కేసులు, వాటికి సంబంధించిన దర్యాప్తు వివరాలను స్టేషన్ సబ్ ఇన్స్పెక్టరు ప్రమోద్‌కుమార్ ను అడిగి తెలుసుకున్నారు.

స్టేషన్‌లో నిర్వహిస్తున్న పలురకాల రికార్డులను పరిశీలించిన అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌లోని అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని, సమస్యతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు సమస్య పరిష్కారం అవుతుందనే నమ్మకాన్ని వారిలో కలిగించాలని, ఫిర్యాదు వచ్చిన వెంటనే స్పందించాలని, ప్రజలకు పోలీసులపై ఉన్న నమ్మకానికి తగినవిధంగా నీతి, నిజాయితీ తో పనిచేయాలన్నారు. పోలీస్ శాఖ కీర్తి ప్రతిష్టలకు భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో పండ్ల మొక్కను నాటారు.

ఈ తనిఖీల్లో ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్, పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్, పరకాల రూరల్ సీఐ పి. రంజిత్‌రావు, ఎస్ఐ సిహెచ్.ప్రమోద్‌కుమార్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బంది విధులు సక్రమంగా నిర్వర్తించాలి

నవతెలంగాణ-ఆత్మకూరు



పెద్దాపూర్ సబ్‌సెంటర్ పరిధిలోని వైద్య సిబ్బంది విధులు సక్రమంగా నిర్వర్తించాలని జాతీయ నాణ్యత ప్రమాణాల గుర్తింపు రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ వినయ్‌సింగ్ అన్నారు. గురువారం పెద్దాపూర్ సబ్‌సెంటర్‌ను ఆయన సందర్శించి రికార్డులు, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలను పాటించి విధులను సక్రమంగా నిర్వర్తించాలని సిబ్బందికి సూచించారు. త్వరలో జాతీయ నాణ్యత ప్రమాణాల గుర్తింపు సంస్థ అధికారులు పెద్దా పూర్ సబ్ సెంటర్‌ను సందర్శిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాణ్యత ప్రమాణాల మేనేజర్ సాగర్,మండల వైద్యాధికారి డాక్టర్ స్పందన, డాక్టర్ పుష్పలత, ఏఎన్ఎం రాజమ్మ, రెడ్ లక్ష్మి, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేలో పంచాయతీ కార్యదర్శులు

నవతెలంగాణ-దామెర

తెలంగాణ ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో పంచాయతీ కార్యదర్శులు కీలక పాత్ర పోషిస్తున్నారని హన్మకొండ జిల్లా పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా కార్యదర్శి ఇంజపెల్లి నరేష్ అన్నారు. ప్రతి ఇంటికి స్టిక్కరింగ్ చేయడము గ్రామంలోని అన్ని కుటుంబాలు సర్వే జరిపే విధంగా చూసుకోవడం ఒక ప్రక్క ఎనిమినేటర్ల విధులు నిర్వహిస్తూ ఇతర ఎన్యుమరేటర్లకు గ్రామ పరిస్థితిపై సమగ్ర సమాచారాన్ని అందిస్తూ సర్వేకు సహకరిస్తూ విజయవంతం చేయుటకు పంచాయతీ కార్యదర్శులు సహకారం అందిస్తున్నారని తెలిపారు.

ఎల్లమ్మ దేవాలయ పనుల పరిశీలన

నవతెలంగాణ-ఐనవోలు



మల్లికార్జునస్వామి దేవాలయ ఆవరణలో చేపడుతున్న ఎల్లమ్మ దేవి ఆలయ నిర్మాణ పనులను ఆలయ కార్యనిర్వహణాధికారి అద్దంకి నాగేశ్వర్‌రావు గురువారం పరిశీలించారు. దేవాదాయ శాఖ స్థపతి సూచనల ప్రకారంగా దాత హైదరాబాద్‌కు చెందిన పర్ష సర్వేశ్వర్ రావు యాదవ్ సుమారు రూ.30 లక్షల వ్యయంతో నిర్మాణం చేస్తున్నారు.

రైతుల పాలిట భూతంలా వ్యవహరిస్తున్న పాలకవర్గం

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య

నవతెలంగాణ-ధర్మసాగర్

రైతులు పాలిటి భూతంలా రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ పాలకవర్గం వ్యవహరిస్తుందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య విమర్శించారు. మండల కేంద్రంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. అనంతరం డాక్టర్ రాజయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు కూడా రైతులకు రైతు రుణమాఫీ చేస్తామని మాయమాటలతో మోసం చేస్తున్నారన్నారు.అరుగాలం రైతులు కష్టపడి పంట పండిస్తే, వాటిని కొనుగోలు చేసిన దాఖలాలు లేవని ఎద్దేవా చేశారు. రైతు భరోసా పేరు మీద ఇచ్చే ఎకరాకు రూ.15వేలకు సంబంధించిన నేటి వరకు కూడా చెల్లించకపోవడం విడ్డూరమన్నారు. రైతుసంక్షేమమే మా నినాదం అంటూ వానకాలం పంటకు రైతుభరోసా ఇవ్వలేమని చెప్పడం కాంగ్రెస్ ప్రభుత్వ దౌర్భాగ్యానికి నిదర్శనమని విమర్శించారు. రైతు పండించి రైతు కల్లాలకు ధాన్యాన్ని తీసుకొస్తే, ఇప్పటివరకు ఒక్క గింజ కొనుగోలు చేయలేదని హేళన చేశారు.

ఈ వయసులో స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూతురు కోసం ఎంత నీచానికైనా దిగజారడానికి నిదర్శనం కాంగ్రెస్‌లో చేరడమేనని ఆరోపించారు. 2011లో కాంగ్రెస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసిన తర్వాత ఎమ్మెల్యే పదవికి ప్రజల ఆకాంక్షలమేరకు తెలంగాణ జెండా పట్టుకొని తిరిగి 33 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందాను అని డాక్టర్ రాజయ్య అన్నారు.

ఇప్పటికైనా నీవు చేసిన ఈ దాష్టమైనటువంటి కార్యానికి నిసిగ్గుగా ఎమ్మెల్యే పదవికి రాజీనామాచేసి దమ్ముంటే బరిలోకి దిగి తాడోపేడో తెల్చుకోవాలని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా కో-ఆప్షన్ సభ్యులు జుబేదా లాల్‌మొహమ్మద్, మాజీ సర్పంచ్ కర్ర సోమిరెడ్డి, నాయకులు బొడ్డు ప్రభుదాస్, మెరుగు రాజు, శాతబోయిన రమేష్, మాచర్ల సుదర్శన్, బొడ్డు బాలు, నాగబెల్లి విజయ్, బొడ్డు ప్రతాప్, బండ భూపాల్ రెడ్డిలు పాల్గొన్నారు.



పేదలపక్షాన ఎర్రజెండా నిరంతర పోరాటాలు

- సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి



నవతెలంగాణ-ఎల్కతుర్తి

పేదల పక్షాన ఎర్రజెండా ఎప్పుడు అండగా ఉంటుందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో ఎల్కతుర్తి శాఖ సమావేశం జిల్లా కమిటీ సభ్యులు గుమ్మడి రాజులు రాములు రాష్ట్ర కమిటీ సభ్యులు అంబాల స్వరూప, లోకిని స్వరూప ఆధ్వర్యంలో జరిగింది. ఎల్కతుర్తి మండలంలో సీపీఐ(ఎం) ఏర్పడి మూడేళ్ల పూర్తయిన సందర్భంగా సమావేశం నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి పుచ్చలపల్లి సుందరయ్య భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా కార్యదర్శి చక్రపాణి, జిల్లా కార్యదర్శి సభ్యుడు సారంపల్లి వాసుదేవరెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు గొడుగు వెంకన్న, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎల్కతుర్తి మండల కేంద్రంలోనే కాకుండా సీపీఐ(ఎం) పార్టీని ప్రతి గ్రామంలో బలోపేతం చేయాలని సూచించారు. అదేవిధంగా ప్రతి గ్రామంలో పేదల పక్షాన నిలబడి వారి సమస్యలను తెలుసుకొని వారికి అండగా నిలవాలన్నారు. బీజేపీ బహుళ జాతి కంపెనీల కొమ్ముకాస్తూ పేదల నడ్డి విరుస్తుందన్నారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో బీజేపీని అరికట్టేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాహుల్‌గాంధీ అక్కడ ఒక మాట తెలంగాణలో ఒక మాట మాట్లాడుతున్నారన్నారు. అక్కడేమో బీజేపీకి వ్యతిరేకం అంటుండగా ఇక్కడేమో సీఎం రేవంత్‌రెడ్డి ఆదానీ, అంబానీలకు వేలాదిఎకరాల భూమిని అప్పనంగా కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు హామీలు కేవలం ఉచిత బస్సు ప్రయాణం, జీరో బిల్లు మాత్రమే అమలవుతుందన్నారు. మహిళలకు రూ. 2500లు, నిరుద్యోగ భృతి ప్రభుత్వం ఇప్పటివరకు ఎవరికీ చెల్లించలేదన్నారు. రైతు రుణమాఫీ సైతం సగం కూడా కాలేదన్నారు. ఎకరాకు రైతుభరోసా కూడా రెండు పంటలకు వేయలేదుని చేయూత రూ.4 వేలు పింఛన్, దివ్యాంగులకు రూ.6వేల పెన్షన్ పెంచుతామని చెప్పి 11 నెలలు గడిచినా పెంచకపోగా రెండు నెలల పెన్షన్ పెండింగ్‌లో ఉంచారన్నారు.

ఏ ప్రభుత్వం ఉన్నా సీపీఐ(ఎం) పార్టీ పేదల పక్షాన నిలబడి కొట్లాడుతుందన్నారు. రాబోయే సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో ఒకరికి వినతిపత్రం ఇచ్చే విధంగా ఉండకుండా సొంతంగా సీపీఐ(ఎం) పార్టీ నిలబడి గెలిచే విధంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలన్నారు. రెండు నెలలు అహర్నిశలు శ్రమిస్తే గెలవడం కష్టమేమికాదన్నారు.

ఈ సమావేశంలో దుంపెల్లి అరుణ, గోల్లే రాదా, అంబాల మమత, షణ్ముఖం, ఎండి.షఫీ, ముద్ర కోల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అసమానతలు లేని సమాజమే లక్ష్యంగా కులగణన

పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్‌రెడ్డి



నవతెలంగాణ-ఆత్మకూరు

అసమానతలు లేని సమాజం లక్ష్యమే సమగ్ర కుటుంబ కుల గణన సర్వే అని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. గురువారం ఆత్మకూరు మండలం పెద్దాపురంలో ఇంటింటా సమగ్ర కుటుంబ కుల గణన సర్వే కార్యక్రమంలో రేవూరి పాల్గొన్నారు. అనంతరం ఇళ్లకు స్టిక్కర్ వేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కులగణన ఇది దేశంలోనే మొదటి సర్వే అని దేశంలోనే ఆదర్శ సర్వేగా నిలుస్తుందని ప్రతి ఒక్కరు సమాజంలో ఏ స్థాయిలో ఉన్నారో ఈ సర్వేతో తెలుస్తుందని అన్నారు. ప్రతి 150 ఇండ్లకు ఎన్యుమరేటర్‌ను నియమించారని వారు ప్రతి ఇంటికి వచ్చి స్టిక్కర్ వేసి సర్వేకు కావల్సిన పత్రాలను ముందుగా వివరిస్తారన్నారు. నియోజకవర్గంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎలాంటి అలసత్వం లేకుండా పకడ్బందిగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎన్యుమరేటర్లు, అధికారులు ప్రతీ కుటుంబానికి ముందస్తు పూర్తి సమాచారం ఇచ్చి సర్వే పూర్తిచేసి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలని కోరారు.

ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డీఓ నారాయణ, తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, సీఐ ఆర్.సంతోష్‌కుమార్, ఎంపీఓ విమల, కాంగ్రెస్ మండల అధ్యక్షులు కమలాపురం రమేష్, మాజీ జెడ్పీటీసీ కక్కెర్ల రాధికరాజుగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్లు పరికరాల వాసు, బాపట్ల కిరీటి, అలువాల రవి, జయా పాల్ రెడ్డి ,ఏరుకొండ రవీందర్ ,అంబటి రాజస్వామి, తదితరులు పాల్గొన్నారు.

దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దు

- ఒడిసిఎంఎస్ సెంటర్ ఇంచార్జ్ చరణ్ సింగ్

నవతెలంగాణ-శాయంపేట

రైతులు కష్టించి పండించిన వరి ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని ఒడిసిఎంఎస్ సెంటర్ ఇంచార్జ్ వాంకుడోత్ చరణ్ సింగ్ అన్నారు. మండలంలోని కాట్రపల్లి గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో భాగంగా రైతులకు సన్నరకం ధాన్యాని కి మద్దతుధర చెల్లించడమేకాక రూ.500 బోనస్ చెల్లిస్తుందని అన్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా గ్రామాలలోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మధ్య దళారీ వ్యవస్థ నిర్మూలనకు పాటుపడుతుందని అన్నారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రయోజనం పొందాలన్నారు. ప్రతీగింజకు గిట్టుబాటు ధరతో పాటు రూ.500లు బోనస్ వస్తాయన్నారు. కాట్రపల్లితో పాటు చుట్టుపక్కల గ్రామాల రైతులు ఈ కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలన్నారు. ధాన్యం విక్రయించిన రైతులకు మొదటి రకానికి రూపాయలు 2320, రెండవ రకానికి 2300 మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. తూకం వేసిన ధాన్యం రైస్ మిల్లులకు తరలించాక రైతుల ఖాతాలో నేరుగా డబ్బులు జమవుతాయని అన్నారు.



ప్రభుత్వ దార్శనీకతకు నిదర్శనమే కులగణన సర్వే : ఎమ్మెల్యే నాయిని



నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

భారతదేశ చరిత్రలో ఏ ప్రభుత్వం చేపట్టలేని నూతన విధానాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని ప్రజలందరు కులగణన సర్వేకు సహకరించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు గురువారం నియోజకవర్గ పరిధిలోని 31వ డివిజన్ న్యూశాయంపేట, 62వ డివిజన్ కాజీపేటచౌరస్తాలో నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, గ్రేటర్ మున్సిపల్ కమీషనర్ అశ్విని తానాజీవాకడేలతో కలిసి రాష్ట్ర ప్రభుత్వ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణనసర్వే కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక వార్డుల్లో ఏర్పాటు చేసిన ఎన్యూమరేటర్లతో కలిసి నేరుగా ప్రజల ఇంటికి వెళ్లి సర్వే ప్రారంభ స్టికర్స్ అంటించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గం పరిధిలో మొత్తం సుమారు 72500 కుటుంబాలకు 527మంది సర్వే అధికారులను ఏర్పాటు చేశామని, 31మంది సూపర్‌వైజర్‌లను నియమించామని ప్రజలందరు అధికారులకు సహకరించాలని కోరారు. ఈనెల 6 నుండి 9వ తేదీ వరకు తొలుత ఆధారాలను నమోదు చేసుకుని, సమగ్ర సర్వే చేపడతారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సర్వే రాష్ట్ర ప్రయోజనాలు, విద్య, ఉపాధి, రాబోవు ఎన్నికల్లో అన్నివర్గాల నాయకులకు రాజకీయంగా సముచిత స్థానం ఉంటుందన్నారు.

ఇంటికి వచ్చిన అధికారికి కుటుంబ సభ్యులు పూర్తిస్థాయిలో సమాచారం అందించి సహకరించాలని కోరారు. ఎన్నికల ముందు తెలంగాణ రాష్ట్రంలో రాహుల్‌గాంధీ చెప్పిన ప్రతి విషయాన్నీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్నారని గుర్తు చేశారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మామిండ్ల రాజు, జక్కుల రవీందర్, సయ్యద్ విజయ శ్రీ రాజాలి, మాజీ కార్పొరేటర్లు శివశంకర్, మోహన్ రావు, గుంటి కుమార్,సుంచుఅశోక్, అధికార ప్రతినిధి ఎండి. అంకుస్, డివిజన్ అధ్యక్షులు షేక్ అసర్, సంతోష్, సిరిల్ లారెన్స్, దొంగలకుమార్, పిండి రమేష్, భైరబోయిన రమేష్, బొందాలు, సుదీర్,కనుకుంట్ల కష్ణ,నన్నెబోయిన బాబురావు,శివ రాం,మాచర్ల జయాకర్,భరత్, ఓజ్జా కరుణాకర్, రాము, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ గొడిశాల రవీందర్, ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, అడిషనల్ కమిషనర్ ఇస్సంపల్లి జోనా, తహసిల్దార్ భావ్‌సింగ్, అంగన్వాడీ టీచర్స్, ఏఎన్ఎంలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చెరువు గట్టు చాట్ పూజ

నవతెలంగాణ-సుబేదారి



చెరువుగట్టు చాట్‌పూజను ఘనంగా నిర్వహించారు. దీపావళి పండుగ తర్వాత ఆరురోజులకు ఉత్తర్ ప్రదేశ్ వాస్తవ్యులు నూతన వస్త్రాలు ధరించి, వారి ఇష్ట దైవానికి పూజలు చేసి సాయంత్రం కుటుంబ సభ్యులు దగ్గరలో ఉన్న చెరువుగట్టుకు చేరుకుని ప్రత్యేక చాట్ పూజలు నిర్వహించి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్‌కిషోర్‌ఝూ హాజరై మాట్లాడుతూ భారత దేశం భిన్న సంస్కృతి సంప్రదాయాలు గల దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో జగత్ రాజ్ సింగ్,సంజయ్‌గుప్తా, విజయ్, వినోద్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

కళాశాల నిర్మాణ స్థలాన్ని పరిశీలన

టీజీఐటీసీ డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి



నవతెలంగాణ-మల్హర్‌రావు/కాటారం

కాటారం మండల కేంద్రంలో నిర్మించనున్న ఐటీఐ కళాశాల నిర్మాణ స్థలాన్ని గురువారం తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(టీజీఐఐసి) మేనేజింగ్ డైరెక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిర్మాణ ప్రణాళికలు, మౌలిక సదుపాయాల అమలు పద్ధతులు, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కళాశాల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి మంజూరు చేసినట్లు తెలిపారు. కాలేజీ నిర్మాణం పటిష్టంగా, నాణ్యత ప్రమాణాలతో విద్యార్థులకు అత్యాధునిక సదుపాయాలు, శిక్షణా మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, తహసీల్దార్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడిగా బండారి కార్తీక్



నవతెలంగాణ-భూపాలపల్లి

భూపాలపల్లి మున్సిపల్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడిగా బండారి కార్తీక్ ఎన్నికయ్యారు. గురువారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సీఐటీయూ శ్రామిక భవనంలో సీఐటీయూ నాయకులు వెలిశెట్టి రాజయ్య, బందు క్రాంతి ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఉపాధ్యక్షుడుగా కోడం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బుస్స రవి,సహాయకార్యదర్శిగా గుడాల అనిల్, కోశాధికారిగా ఒంటేరు రాజ్‌కుమార్. అంతడుపుల సతీష్, మేకలకార్తీక్, ఈర్ల అనిల్, సోమిడి రామస్వామి, జంగ రాజు, ఇంజపురి కుమార్, మట్టేవాడ ప్రకాష్, అట్టల వెంకటస్వామి, నాగవత్ రాజేందర్, నాగవత్ క్రాంతి, లింగబత్తుల తిరుపతి, పంచిక రమేష్, కాపరబోయిన నగేష్, కొత్తపెల్లి రఘు, గంట పవన్, మోకిడి అశోక్, కొత్తకొండ మణికంఠను సభ్యులుగా ఎన్నుకున్నారు.

అవగాహన కల్పించాం : జిల్లా కలెక్టర్

నవతెలంగాణ-మల్హర్‌రావు



సన్న రకం, దొడ్డు రకం ధాన్యం కొనుగోలుకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించామని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గురువారం మల్హర్‌రావు మండలం కొండంపేట గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. సమగ్ర కార్యాచరణ అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.గతంలో జి ల్లాలో 236 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉంటే ప్రస్తుతం 323 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో అవసర మైన వేయింగ్, తేమ పరిశీలించే పరికరాలు, టార్పాలిన్లు ఒదుబాటులో ఉం డేలా చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లా సరిహద్దులో చెక్ పోస్ట్ ఏర్పాటు చేసి వ్యవసాయ, రెవెన్యూ, పోలిస్ అధికారులు 24 గంటలపాటు తనిఖీ చేపట్టేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద అవసరమైన మేర టార్పాలిన్లు, గన్ని సంచులు అందుబాటులో పెట్టామని అన్నారు. కొనుగోలు చేసిన వెంటనే ధాన్యం తరలించేలా అవసరమైన వాహనాలు సన్నద్ధం చేశామన్నారు. అత్యవసర సమయాల్లో ధాన్యం నిల్వ చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మిల్లర్లతో సమావేశం నిర్వహించి బియ్యం అప్పగించిన వెంటనే బ్యాంకు గ్యారంటీలు విడుదల చేస్తూ సమాచారం అందించామని, బ్యాంకు గ్యారంటీ ఇచ్చేందుకు జిల్లాలో మిల్లర్లు అంగీకరించారని తెలిపారు. ధాన్యం రవాణాకు కేటాయించిన వాహనాలు ఇతర పనులకు వినియోగించొద్దన్నారు. ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, మార్కెటింగ్ అధికారి కనక శేకర్, అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, డీఎస్ఓ శ్రీనాథ్, డీఎం కనక శేఖర్, డీసీవో వాలియా నాయక్, విద్యుత్ శాఖ ఎస్ఈ మల్చూర్‌నాయక్, తాడిచెర్ల పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య వైస్ ఛైర్మన్ ప్రకాష్‌రావు, మాజీ ఎంపీపీ మలహల్‌రావు, సమ్మయ్య కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజయ్య, మహిళ అధ్యక్షురాలు కొండ రాజమ్మ, సింగిల్ విండో డైరెక్టర్లు సంగ్గెం రమేష్, వొన్న తిరుపతిరావు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ముందు ఇండ్ల గుర్తింపు..తర్వాతే సమగ్ర సర్వే

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

నవతెలంగాణ-మల్హర్‌రావు



సమగ్ర సర్వేలో భాగంగా ముందు ఇళ్ల గుర్తింపు తరువాతే సర్వే ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటింటికీ వెళ్లి వివరాల సేకరణ చేస్తారని భూపాల పల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం మండలంలోని కొ య్యూరు గ్రామంలో చేస్తున్న సర్వే సేకరణ ప్రక్రియను తనిఖీ చేసి ఆయన మాట్లాడారు.సర్వే జిల్లాలో బుధవారం ప్రారంభమైందని అన్నారు. ఎన్యూమరేటర్లు ఇండ్ల గుర్తింపు ప్రక్రియ చేపట్టి సర్వే స్టిక్కరింగ్ చేస్తునట్లు తెలిపారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు ఉదయం తరగతులు బోధించి మధ్యాహ్నం తర్వాత సర్వేలో పాల్గొననున్నారన్నారు. జిల్లాలోని 241 గ్రామ పంచాయతీలు, ఒక మున్సిపాలిటీల పరిధి ఇండ్లను ఎన్యూమరేటర్లు సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొయ్యూరు గ్రామ పంచాయతీ పరిధిలో 150 ఎన్యూమరేషన్ బ్లాకులు ఉన్నాయని, బుధవారం వరకు 68 ఇండ్లు పూర్తి అయ్యాయని అన్నారు. మిగిలిన ఇండ్లు సర్వే నేటితో పూర్తి అవుతుందని తెలిపారు. మండలంలోని 15 గ్రామ పంచాయతిల్లో గణన ప్రక్రియ ప్రారంభమైనట్లు తెలిపారు. జిల్లాలో 933 ఎన్యూమరేషన్ బ్లాక్ (ఈబీ) లను గుర్తించామని తెలిపారు. సర్వే తదుపరి డేటా ఎంట్రీ చేసేందుకు అవసరమైన కంప్యూటర్లు అందుబాటులో ఉంచుకోవడంతో పాటు డేటా ఎంట్రీ ఆపరేటర్లను సిద్ధం చేయాలని, అవసరమైన కంప్యూటర్లు ప్రభుత్వ కార్యాలయాల నుండి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ శ్యామ్ సుందర్, సూపర్‌వైజర్ కమల, ఎన్యూమరేటర్ శాంతిలత పాల్గొన్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి

నవతెలంగాణ-భూపాలపల్లి



గ్రూప్-3 పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. గ్రూప్ 3 పరీక్ష నిర్వహణపై గురువారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో గ్రూప్ 3 పరీక్ష నిర్వ హణపై చీఫ్ సూపరింటెండెంట్స్‌తో సమావేశమై ఆమె మాట్లాడారు. జిల్లాలో కేంద్రాల ఏర్పాట్లు, సెక్యూరిటీ, పరీక్షా విధానం మరియు విద్యార్థుల కు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ఈ నెల 17, 18 తేదీల్లో జరుగనున్న పరీక్షకు 17 పరీ క్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షా పేపర్లు భద్రపర్చేందుకు స్ట్రాంగ్‌రూమ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పరీక్ష నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పరీక్ష పర్యవేక్షణ కో ఆర్డినేటర్ వెంకన్న, అదనపు కో ఆర్డినేటర్ అనిల్ కుమార్, కలెక్టరేట్ ఏఓ ఖాజా మోహినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి : డీఈఓ

నవతెలంగాణ-మల్హర్‌రావు

పదవ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని భూపాలపల్లి డీఈఓ రాజేందర్ విద్యార్థులకు సూచించారు. గురువారం మండల కేంద్రమైన తాడిచెర్లలో ప్రభుత్వ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి ఆయన మాట్లాడారు. జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహణ ఎలా జరుగుతుందో పరిశీలించారు. మండలంలోని అన్ని జిల్లా పరిషత్ పాఠశాలతోపాటు తెలంగాణ ఆదర్శ, కస్తూరిబ్బా ఆశ్రమ పాఠశాలల్లో 10వతరగతి విద్యార్థు 100శాతం ఉత్తీర్ణత సాధించుటకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎంఈఓ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు కబ్జాను ఎంపీడీఓ పరిశీలన

నవతెలంగాణ-మల్హర్‌రావు



మండలంలో మల్లారం గ్రామంలోని 8వ వార్డులో సీసీ రోడ్డును కబ్జాకు పాల్పడిన నెరుడుగొమ్మ కాంతారావు అనే వ్యక్తికి అక్టోబర్ 16న పంచాయతీ కార్యదర్శి చెలుకల రాజు యాదవ్ నోటీస్ జారీ చేసిన విషయం తెలిసిందే. నోటీస్ జారీ చేసిన మూడు రోజుల్లో సంజాయిస్ ఇవ్వాలని అధికారులు ఆదే శాలు జారీ చేశారు. కబ్జాకు పాల్పడిన సదరు వ్యక్తి న్7నుంచి ఎలాంటి స్పం దన లేకపోవడంతో బుధవారం మండల పరిషత్ అధికారి శ్యాం సుందర్ క బ్జాకు గురైన సిసి రోడ్డును పరిశీలించారు. కబ్జాదారుకు రెండవ నోటీస్ జారీ చేయాలని కార్యదర్శికి ఆదేశాలు ఇవ్వడంతో గురువారం కార్యదర్శి రెండవ నోటీస్ జారీ చేశారు. అక్రమంగా సీసీ రోడ్డును అనుకొని నిర్మాణం చేపట్టిన ప్రహరీని ఎంపీడీఓ పరిశీలించినట్లుగా కార్యదర్శి తెలిపారు. కబ్జాకు యత్నం చేసిన వ్యక్తి మూడు రోజుల్లో సంజాయిస్ ఇవ్వకుంటే చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు.

భూపాలపల్లి మున్సిపాలిటీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తా

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

రూ.278 లక్షలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ-భూపాలపల్లి



భూపాలపల్లి మున్సిపాలిటీని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. గురువారం భూపాలపల్లి మున్సిపాలిటీ పాలిటీ పరిధి పలు వార్డుల్లో 15వ ఆర్థిక సంఘం నిధులు, టీయూఎఫ్ఐడీసీ నిధులతో ఫేజ్-5 కింద సుమారు రూ.278 లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. ముందుగా 22వ వార్డులో రూ.25లక్షలతో పాత గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం 1వ వార్డులో రూ.30 లక్షలతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులను శంకుస్థాపన చేశారు. అదేవిధంగా రూ.80 లక్షలతో కాశింపల్లి బ్రిడ్జి వద్ద రిటర్నింగ్ వాల్, కల్వర్టు పనులకు, రూ.143 లక్షలతో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేసి ఎమ్మెల్యే మాట్లాడారు. భూపాలపల్లి నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేస్తున్నట్లు తెలిపారు. భూపాలపల్లి మున్సిపాలిటీ తో పాటు, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివ ద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. సదరు గుత్తేదారు పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరాణి సిద్దు, కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, కురిమిళ్ళ రజిత శ్రీనివాస్, ముంజాల రవీందర్, పిల్లలమర్రి శారద నారాయణ, పానుగంటి హారిక శ్రీనివాస్, అనిల్, చల్ల రేణుక, నాయకులు బుర్ర కొమురయ్య, సాంబమూర్తి, పృథ్వీతోపాటు తదితరులు పాల్గొన్నారు.

మోడికుంట ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టాలి

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్

నవతెలంగాణ-వాజేడు





మండలంలో సాగునీరు, తాగునీరు అందించే మోడికుంట ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని సీపీఐ (ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్ అన్నారు. శుక్రవారం గుమ్మడిదొడ్డి గ్రామంలో జరిగిన పార్టీ మండల 9వ మహాసభలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతాల్లో మారుమూల ప్రాంతమైన మండలంలో వ్యవసాయ రంగం అభివృద్ధి కావాలంటే సాగునీరు కీలకమన్నారు. అనేక సంవత్సరాలుగా మోడిగుంట ప్రాజెక్టు నిర్మాణం పెండింగ్‌లో ఉందని, నాడే తమ పార్టీ నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య ఈ ప్రాజెక్టు విశిష్టతను తెలిపినట్టు చెప్పారు. నాటి నుంచి ఈనాటి వరకు ప్రాజెక్టు పట్ల ప్రభుత్వాలు పెడ చెవిన పెడుతున్నాయని ఆరోపించారు. అన్ని రకాల అనుమతులు వచ్చినప్పటికీ నిధుల మంజూరులో జాప్యం జరుగుతుందని, 25 కిలోమీటర్ల మేర గోదావరి ప్రవహిస్తున్న,వ్యవసాయ రంగానికి సుక్క నీరు కూడా ఉపయోగించుకునే పరిస్థితిలో వాజేడు మండలం లేదని వాపోయారు. ఈ 9వ మహాసభ అనంతరం మోడీ కుంట సమస్య పరిష్కారం కోసం ఆందోళనలకు రూపకల్పన చేయనుననట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలతో కాలయాపన చేస్తుందని, గ్రామాల్లో సమస్యలు పేరుకుపోతున్నాయని విమర్శించారు. రేషన్ కార్డు పెన్షన్ ఇచ్చిన పరిస్థితి లేదని ఎద్దేవా చేశారు. హైడ్రా, సర్వేల పేరుతో కాలయాపన చేస్తున్నదని, ప్రజా సమస్యలను పక్కన పెట్టిందని అన్నారు. మండలంలో ప్రధానంగా మిర్చి వ్యవసాయం అధికమని, మార్కెట్‌లో డిమాండ్ లేకపోవడంతో దళారుల చేతిలో మోసపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మహాసభకు ముందు పార్టీ జెండాను సీనియర్ నాయకురాలు తుమ్మ దేవేంద్ర ఆవిష్కరించారు. అనంతరం అమరవీరుల చిత్రపటాలకు పూలమాలేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బీరెడ్డి సాంబశివ, జిల్లా కమిటీ సభ్యులు ఎండీ దావుద్, ఆగి రెడ్డి, మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు, నాయకులు జజ్జరి దామోదర్, బచ్చుల కృష్ణబాబు, సౌమ్య గుగ్గిల దేవయ్య, కృష్ణబాబు, కారం నాగేశ్వరరావు, పవన్ కుమారి కారం భూలక్ష్మి, నాగలక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే పట్టణ అభివృద్ధి

కాంగ్రెస్ ప్రభుత్వంలో నిధులు నిల్...
పాత పనులకే... కొత్తగా శిలాఫలకాలు
మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్ వెంకటరాణి సిద్ధు
డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్ధిదారులకు అందించాలి
మున్సిపల్ వైస్ చైర్మన్ గండ్ర హరీష్ రెడ్డి



నవతెలంగాణ-భూపాలపల్లి

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి చొరవతో భూపాలపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి టీయుఎఫ్ఐడిసి నిధుల ద్వారా రూ.90కోట్లు మంజూరు చేసి అందులో దాదాపు రూ.60 కోట్ల పనులు పూర్తి చేశామని, కాంగ్రెస్ ప్రభుత్వంలో కొత్తగా నిధులేమి రాలేదని, పాత పనులకే ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మళ్ళీ నూతనంగా శిలాఫలకాలు ఆవిష్కరిస్తున్నారని భూపాలపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ ఎస్ వెంకటరాణి సిద్దు అన్నారు. గురువారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గండ్ర హరీష్‌రెడ్డితో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరాణి సిద్దు మాటాడారు. టీయుఎఫ్ఐడిసి మిగతా రూ.30కోట్ల తో పనుల ప్రారంభం కోసం మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి శిలాఫలకాలు వేయడం జరిగిందని, ఎలక్షన్ కోడ్ రావడంతో పనులను ప్రారబించలేక పోయారని అన్నారు. ఎలక్షన్ తర్వాత కాంగ్రెస్ నుండి గెలుపొందిన ఎమ్మెల్యే ప్రజలను తప్పు దోవ పట్టిస్తూ గతంలో వేసిన పనులకు శిలాఫలకాలు వేసిన చోటనే మళ్ళీ శిలా ఫలకాలు వేయిస్తూ ప్రారంభోత్సవాలు చేస్తున్నారని ఆరోపించారు. వారి వ్యక్తిగత స్వార్థం కోసం పనులకు ఆటంకం కలిగిస్తున్నారని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వ 11 నెలల పాలనలో మున్సిపాలిటీకి పైసా తీసుకు రాలేదని విమర్శించారు. ప్రభుత్వం నుండి నిధులు తెచ్చి పట్టణాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. రూ.10కోట్లతో అంబేద్కర్ సెంటర్ నుండి స్థానిక రామ్‌నగర్ వరకు నాలుగు లైన్ల రోడ్ వేయడానికి డివైడర్ నిర్మించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటే ప్రస్తుతం పనులను ఆపేశారన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గండ్ర హరీష్ రెడ్డి మాట్లాడుతూ... బీఆర్ఎస్ హయాంలో నిరుపేదలకు వెలిశాలపల్లిలో 544, భాస్కర్ గడ్డలో 416 ఇండ్లు నిర్మించి ఎ లక్కీ డ్రా ద్వారా పంపిణీ చేశామన్నారు. కానీ భాస్కర్ గడ్డలో ఉన్న ఇండ్లను లబ్ధిదారులకు అందించకుండా మళ్ళీ సర్వే పేరుతో కాంగ్రెస్ జాప్యం చేస్తూ డబ్బులు వసూలు చేసే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. అర్హులైన లబ్దిదారులకు ఇండ్లు అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్ధన్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ నూనె రాజు, యూత్ అధ్యక్షుడు బుర్ర రాజుగౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు కొత్త హరిబాబు,దార పూలమ్మ, బానోత్ రజిత, మమత, మౌనిక, మురళీధర్, కోఆప్షన్ ఐలయ్య, పార్టీ నాయకులు రాములు, శ్రీకాంత్ పటేల్, రాజేష్, రాకేష్, కోటి, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

పంట రుణాలు ఇవ్వాలని బ్యాంకు ఎదుట ధర్నా

నవతెలంగాణ-మల్హర్‌రావు/మహాముత్తారం



రైతు పట్టాలన్నింటికీ బ్యాంకు రుణాలు ఇవ్వాలని కోరుతూ జయశంకర్-భూపాల పల్లి జిల్లా మహాముత్తారం మండలంలోని ప్రధాన రోడ్డు, స్థూపం వద్ద నుండి తెలంగాణ గ్రామీణ బ్యాంక్ వరకు బీఆర్ఎస్ విభాగం, తెలంగాణ ఆది వాసీ గిటిజన సంఘం లంబాడీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ర్యాలీ చేసి ధర్నా నిర్వహించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్‌కు వినాపత్రా న్ని అందజేశారు. బ్యాంకు నిల్వల కంటే అప్పులే ఎక్కువ అయ్యాయని టార్గెట్ మించి అప్పులు పంట రుణాలు ఇచ్చామని ప్రభుత్వం నుంచి మా పై అధి కారుల నుంచి ఇక రుణాలు ఇవ్వొద్దని ఆదేశాలు ఉన్నట్టు బ్యాంక్ అధికారులు పేర్కొన్నారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు నుండి తహసీల్దార్ ఆఫీస్ వద్దకు ర్యాలీగా వెళ్లి తహశీల్దార్‌కు సైతం వినతిపత్రాన్ని అం దజేశారు. ఆర్‌వైఎఫ్‌ఆర్ పట్టాలు లావాణి పట్టాలున్న రైతులకు పంట రుణాలు ఇవ్వకపోవడంతో ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తులని ఆశ్రయించి నష్టపోతున్నట్టు తెలిపారు. వెంటనే రుణాలు అందజేయకుంటే ఆందోళన ఉధృతం చేస్తా మని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మార్క రామ గౌడ్,రాధారస్వామి, సురేష్ జగపతి తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పోలం రాజేందర్, తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు తడండ్ల శ్రీను, కుమ్మరి గణేషు, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు, లంబాడి హక్కుల పోరాట సమితి నాయకులు రైతులు పాల్గొన్నారు.

ఘనంగా సీవీ రామన్ జయంతి

నవతెలంగాణ-చిట్యాల

చిట్యాల మండలంలోని ఆదర్శ పాఠశాల కళాశా లలో డాక్టర్ సీవీ రామన్ జయంతిని ఘనంగా ని ర్వహించారు. పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ మేకల రమేష్ పాల్గొని సివి రామన్ గొప్పతనాన్ని కొని యాడారు. సైన్స్ పట్ల ఆయన చేసిన సేవలు గాను 1924లో రాయల్ సొసైటీ పెల్లోషిప్, 1929లో బ్రిటిష్మహా రాణి నుండి నైట్ పుడ్ సర్ ,1954లో భారతరత్న, పురస్కారాలు అందుకున్న మహా మేధావి అని అన్నారు. విద్యార్థులు ఉన్నతంగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఉపాధ్యాయులు ఎస్ రవీందర్, వెంకటే శ్వర్లు ధనలక్ష్మి సమీరా, వాణి, శివ,రాజు, ఆ యేషా, జోష్ణదేవి, శబిరుద్దీన్ పాషా, శ్రీకాంత్, రామస్వామి పాల్గొన్నారు.



18-20 ఆర్‌పీఎం నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర

నవతెలంగాణ - ములుగు



ప్రతి హార్వెస్టర్ వరి కోత సమయంలో 18-20 ఆర్‌పిఎం నిర్వహించాలని, తద్వారా మంచి వరి వస్తుందని, తాలూ, పండని ధాన్యం కూడా తొలగిపోతుందని జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 2024-25 ఖరీఫ్ పంట కోతలో పాల్గొన్న హార్వెస్టర్ యజమానులతో ఎస్పి శబరిష్, అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జితో కలసి సమావేశమై ఆయన మాట్లాడారు. అన్ని మండల వ్యవసాయ అధికారులు, హార్వెస్టర్ యజమానులతో మండల స్థాయిలో సమావేశం నిర్వహించి సూచనలు ఇవ్వాలని, రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిని అన్ని అంశాలను, ఇబ్బందులను అధికారులను తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతులకు సకాలంలో డబ్బులు జమయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో ఆర్డీఓ ఎన్ వెంకటేష్, డీసీఎస్ఓ షా ఫైజల్ హుసేని, డీఎండీసీఎస్ఓ రాంపతి, జిల్లా సహకార అధికారి సర్దార్ సింగ్, గిరిజన సహకార కార్పొరేషన్ ప్రతాప్ రెడ్డి, డిప్యూటీ తహసీల్ధార్ నితీష్, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనరసింహారావు

నవతెలంగాణ-ఏటూరునాగారం ఐటిడిఏ



కార్యకర్తలకు బీఆర్ఎస్ ఎప్పుడు అండగా ఉంటుందని, మనోధైర్యం కోల్పో వద్దని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనరసింహారావు తెలిపారు. మం డలంలోని కొండయ్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మల్లెల మూర్తి అనా రోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న లక్ష్మీ నరసింహారావు పార్టీ నా యకులతో గురువారం అతని ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. పార్టీ కార్యకర్త అట్టెం నాగరాజ ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సునీల్ కుమార్, సీనియర్ నాయకులు తాడూరి రఘు తాటికృష్ణ, మాదారి రామయ్య, కుమ్మరి చంద్రబాబు ఖాజా పాషా, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గం

సీపీఐ(ఎం) మండల కార్యదర్శి సోమ మల్లారెడ్డి

నవతెలంగాణ-గోవిందరావుపేట



ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు ఒక్కటే మార్గమని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి సోమ మల్లారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పస్రా గ్రామంలో సుందరయ్య నగర్‌లో ఏర్పాటు చేసిన పార్టీ సమావేశంలో మల్లారెడ్డి మాట్లాడారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో ఎంతోమంది ప్రజలు నివాస స్థలము ఇండ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. 25ఏండ్లుగా పట్టించు కోకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా ఇందిరమ్మ గృహాలు అర్హులైన వారికి అందించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో ఇప్పటికీ సరైన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల ప్రజలు పారిశుధ్యంలో మగ్గి అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. ఈనెల 12న తహసీల్ధార్ కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమం లో నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు 'విద్యార్థిని రిషిక'

నవతెలంగాణ - ములుగు



జిల్లాలోని ములుగు మండలం జంగాలపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థిని రిషిక అండర్ 17 ఖోఖో క్రీడా పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. గురువారం విద్యార్థులు, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు కలిసి రిషికను ఘనంగా సత్కరించారు. ఈనెల 6వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరిగిన అండర్-17 ఖోఖో బాలికల విభాగంలోజంగాలపల్లి జడ్పీహెచ్ఎస్ 9వవ తరగతి విద్యార్థినీలు అజ్మీర రిషిక, గుగులోతు శివాని అనే ఇద్దరు అత్యంత ప్రతిభ కనపర్చారు. కాగా అజ్మీర రిషీక రాష్ట్ర స్థాయి ఖోఖో జట్టుకు ఎంపిక అయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ శ్యామల శ్రీనివాసులు తెలి పారు. ఈనెల 8వ తేది నుండి 10వ తేదీ వరకు మూడు రోజులు ఖమ్మం జిల్లా కల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి ఖోఖో క్రీడలలో పాల్గొంటుందని వ్యాయామ ఉపాధ్యాయులు గుండెబోయిన మల్లయ్య తెలిపారు. అనంతరం అజ్మీర రిషిక ను పాఠశాల ఉపాధ్యాయులు రవీందర్, రమేష్, వీరభద్రయ్య, క ష?మూర్తి, అరుణ కుమారి, పద్మ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-మంగపేట



రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం సాయంత్రం మండల కేంద్రంలోని ఏటూరునాగారం బూర్గంపహాడ్ ప్రధాన రహదారిపై గౌరారం వాగు బ్రిడ్జ్ వద్ద చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... ఏటూరునాగారం మండలం కంతనపల్లి గ్రామానికి చెందిన కొంపల్లి నాగేష్(40) ఏటూరునాగారం మండల కేంద్రంలో జరిగిన ఓ వేడుకకు హాజరై అక్కడి నుండి మంగపేట మీదుగా మల్లూరు వైపు వెళుతున్నాడు. ఈక్రమంలో గౌరారం వాగు బ్రిడ్జి పై ఎదురుగా వస్తున్న ఇసుక లారి ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలంలో ఉన్న స్థానికులు గమనించి నగేష్‌ను ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్ జిల్లా కేంద్రంలోని ఎంజీఎంకు తరలిస్తుండగా మృతిచెందినట్టు సమాచారం.

కాంటాలైన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్



నవతెలంగాణ-జనగామ

కొనుగోలు కేంద్రాల్లో కాంట అయిన ధాన్యాన్ని పరితగతిన రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్ అన్నారు. గురువారం జిల్లాలోని రఘునాథపల్లి మండలం నిడిగొండ, శ్రీమన్నారాయణపురం, బాంజీపేట, కంచనపల్లి గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు కేంద్రంలో ఆరబోసిన సన్న, దొడ్డు రకం ధాన్యం తేమ శాతం, తదితర మౌలిక సదుపాయాల గురించి ఆరా తీశారు. అలాగే సరిపడా టార్పాలిన్లు, అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం కాంటా అవ్వగానే ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించాలని, ఎటువంటి నిర్లక్ష్యం తగదని అన్నారు. ఓపీఎంఎస్ లో వెంటనే నమోదు చేయాలని కేంద్ర నిర్వాహకులను ఆదేశించారు.

అనంతరం కొనుగోలుకు సంబంధించిన రిజిస్టర్ లను తనిఖీ చేసి, సంబంధిత సిబ్బందికి తగు సూచనలు చేశారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్దనే అమ్ముకొని, మద్దతు ధర పొందాలని, ఎలాంటి ఆందోళన చెందవద్దని ఆయన తెలిపారు. అనంతరం అదే మండలంలోని నిడిగొండ గ్రామ పరిధిలో గల ఎస్సీ,బీసీ కాలనీల్లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణ తీరును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటిని సర్వే చేసి స్టికర్ లను సక్రమంగా అతికించాలని ఎన్యూమరేటర్‌లకు సూచించారు. ఈ సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కేంద్రాల పరిశీలనలో సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు, ఉపాధ్యాయ సంక్షేమమే ధ్యేయం



నవతెలంగాణ-స్టేషన్ ఘన్‌పూర్

విద్యారంగ సమస్యలు, ఉపాధ్యాయ సంక్షేమమే ధ్యేయంగా టీఎస్ యూటీఎఫ్ పనిచేస్తుందని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి చిక్కుడు శ్రీనివాస్ అన్నారు. చిల్పూర్ మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను చిల్పూర్ మండల శాఖ నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎస్‌బి.వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా గబ్బెట రమేష్, ఉపాధ్యక్షులుగా జే.దేవ్‌సింగ్, మహిళా ఉపాధ్యక్షులుగా ఏ. స్వప్న, కోశాధికారిగా జీ. రవీందర్ ప్రసాద్ ఎన్నికైనట్లు జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పాలన ఏడాది కావొస్తున్న ఉపాధ్యాయ కరువు భత్యం ఆరుబకాయిలు, నూతన వేతన సవరణ సిఫార్సుల అమలు ఏమాత్రం పట్టించుకోకుండా కేవలం ఓక విడత బకాయి విదల్చడం సరికాదన్నారు. ఉపాధ్యాయులకు బకాయిపడ్డ 6విడతల కరువు భత్యాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే ఏడాది మార్చిలో జరుగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఈ పర్యాయం సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డినే తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ బలపరుస్తూ పోటీలో నిలిపిందని అన్నారు. ఉపాధ్యాయ సంక్షేమం కోసమే అవిరాలంగా పాటుపడిన నర్సిరెడ్డినే గెలిపించాలని కోరారు.

12న కలెక్టరేట్‌లో జాబ్ మేళా

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

ఈనెల 12న కలెక్టరేట్లోని జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలోని 2వ అంతస్తులో 8వ రూంలో ప్రైవేట్ రంగంలో జాబ్ వేళాను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి మల్లయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాదుకు చెందిన కేఎల్ గ్రూప్ ఈ ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నట్లు, ఆసక్తి అర్హత ఉన్న అభ్యర్థులు ఈ నెల 12న సంబంధిత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని, మిగతా వివరాలకు కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ గీత నెంబర్ 7995430401 సంప్రదించాలని సూచించారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్



నవతెలంగాణ-లింగాలఘనపురం

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం చెకుముకి టాలెంట్ టెస్ట్ పోటీపరీక్షలు నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో 8,9 ,10 తరగతులు విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించారు. ఉత్తమనైపుణ్యం ప్రదర్శించిన విద్యార్థులుకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కులగణన సర్వేలో 'మేర'లు పాల్గొనాలి

నవతెలంగాణ-కాశిబుగ్గ

ఈ నెల 6నుండి 21వరకు జరుగుతున్న సమగ్రకుల గణన సర్వేలో మేర కులస్తులందరూ పాల్గొని తమ కులం మేర అని రాయించుకోవాలని మేర సంఘం వరంగల్ జిల్లా నాయకుడు సంగ వెంకటరాజం గురువారం ఒక ప్రకటనలో కోరారు. బీసీ కులాల గణనలో భాగంగా కుల దరఖాస్తు ఫారంలో బిసి-డి చిప్పోలు (మేర) సీరియల్ నంబర్ 5అని ఎన్యూమరేటర్లకు తెలుపుతున్నాం, కానీ వారి వద్ద ఉండే దరఖాస్తు ఫారంలో మన కులం కోడ్ 088గా ప్రభుత్వం కేటాయించిన విషయాన్ని గమనించాలని కోరారు. వృత్తి టైలర్స్ అని తెలియజేయాలన్నారు. గతంలో సకల జనుల సర్వే చేసినప్పుడు మన కులానికి ప్రత్యేకమైన కాలం లేకపోవడం వల్ల మేర, దర్జీ, టైలర్, చిప్పోళ్లు అని తెలియజేయడం వల్ల రాష్ట్రంలో దాదాపు 9లక్షలు ఉన్న మేర జనాభా కేవలం 90వేలుగా నమోదు చేయడం జరిగిందన్నారు. కాబట్టి ఇప్పుడు జరుగుతున్న సమగ్ర కులగణన సర్వేలో స్థానికులతో పాటు దేశ విదేశాలలో ఉన్న మేర కులస్తులందరూ పాల్గొని సరైన వివరాలు నమోదు చేయించుకోవాలని కోరారు.

ఆన్ జాబ్ ట్రైనింగ్‌తో వృత్యంతర శిక్షణ

డీఐఈఓ డాక్టర్ శ్రీధర్ సుమన్



నవతెలంగాణ-వరంగల్

ఆన్‌జాబ్ ట్రైనింగ్‌తో విద్యార్థుల్లో ఆయా గ్రూపుల్లో వృత్తి నైపుణ్యం పెరుగుతుందని, ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు 2 నెలల పాటు ఒకేషనల్ విద్యార్థులు తప్పనిసరిగా వృత్యంతర శిక్షణ పొందాలని వరంగల్ జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి డాక్టర్ శ్రీధర్ సుమన్ అన్నారు. గురువారం వరంగల్ పట్టణంలోని పలు ఒకేషనల్ కళాశాల విద్యార్థుల శిక్షణా కేంద్రాలను సందర్శించారు. వరంగల్ పట్టణంలోని సికెయం ఆసుపత్రి, విద్యార్థి కంప్యూటర్స్ తదితర కేంద్రాల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థుల హాజరు, శిక్షణా పద్ధతులను పరిశీలించారు. అధ్యాపకులు, విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. ఒకేషనల్ విద్యార్థులకు రెండు నెలల పాటు ఆన్ జాబ్ ట్రైనింగ్ తప్పనిసరి అని, విద్యార్థుల్లో పాఠ్యాంశాలతో పాటు వృత్తి నైపుణ్యం, సమస్యా పరిష్కారం, కమ్యూనికేషన్ తదితర వివరాలను ప్రతీ విద్యార్థి డైరీ రూపంలో నమోదు చేసుకోవాలన్నారు. విద్యార్థులు వృత్యంతర శిక్షణలో తప్పక 90శాతం కలిగి ఉండేలా సంబంధిత అధ్యాపకులు తగు ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.

మహాపాద యాత్రను జయప్రదం చేయండి

నవతెలంగాణ-నర్సంపేట

తెలంగాణ రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యస్థాపన సాధనకై ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు డాక్టర్ విశారదన్ మహరాజ్ పాదయాత్రను జయప్రదం చేయాలని డీఎస్‌పీ మండల కన్వీనర్ సంగా శివకృష్ణ కోరారు. విశారదన్ మహరాజ్ 15వేల కిలో మీటర్‌ల మాభూమి పాదయాత్ర చేపడుతున్నట్లు ప్రకటించడం చారిత్రాత్మకమని తెలిపారు. ప్రజలందరికీ ఉచిత విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు ఐదు గ్యారెంటీల సాధించడానికి అణగారిన ప్రజలను చైతన్యవంతులుగా చేసి పీడిత వర్గాల రాజ్యాధికారం కోసం రహదారిని వేయడానికి ఈ పాదయాత్ర ఎంతగానో దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విశారదన్ మహరాజ్‌కు పాదయాత్రకు స్వాగతం పలికి బాసటగా నిల్వాలని కోరారు.

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

9, 10 తేదీల్లో ప్రత్యేక సవరణ - 2025 క్యాంపెయిన్ : కలెక్టర్

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం - 2025 క్యాంపెయిన్ ను అర్హులైన జిల్లా ప్రజలందరూ వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గురువారం కోరారు. ఇప్పటికే 18 ఏళ్ల నిండిన వారు (లేదా) 2025 జనవరి 1నాటికి 18 ఏళ్ల నిండబోయే వారు ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హులన్నారు. అందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఫారం 6- కొత్తఓటరుగా నమోదు చేసుకోవడానికి, ఫారం 7- జాబితాలో అభ్యంతరాలు తెలపడానికి, ఫారం-8 ఓటరువివరాల్లో సవరణలు చేయడానికి ఇంటి చిరునామా మార్పు, సవరణలు, (కొత్త, దివ్యాంగులుగా గుర్తింపు మొదలైనవి). ఈ నెల 9, 10 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బూత్ స్థాయి అధికారులు ఆయా పోలింగ్ బూత్ ల వద్ద అందుబాటులో ఉంటారని, ఓటరు వివరాలను సరిచేసుకోవడం (లేదా) కొత్త ఓటరుగా నమోదుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఓటరుగా నమోదు చేసుకునే మరిన్ని వివరాలకు **voters.eci.gov.in** వెబ్సైట్ ద్వారా (లేదా) ఓటర్ **Helpline** మొబైల్ యాప్ ద్వారా కూడా ఓటరుగా సులభంగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలందరూ సహకరించాలి

- జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలందరూ సహకరించాలని కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ కోరారు. గురువారం సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్, (రెవెన్యూ) రోహిత్ సింగ్ లతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి,రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే)ను చేపట్టిందన్నారు. ఈ సర్వేప్రక్రియలో భాగంగా జిల్లాల్లో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు ఇంటింటి జాబితా రూపొందిస్తున్నామన్నారు. ఈ నెల 9 నుంచి సమగ్ర ఇంటింటి సర్వే నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుందని, 18వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. జిల్లాలో ఈ సర్వేకు నోడల్ అధికారిగా అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, పర్యవేక్షణ అధికారిగా అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ లు వ్యవహరిస్తారన్నారు. ఈ సర్వే పట్ల జిల్లా యంత్రాంగం ఎంతగానో శ్రమిస్తోందన్నారు. ఈ సర్వే ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని, అందుకోసం మూడంచెల పర్యవేక్షణ టీమ్ లను నియమించినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రతి 150 కుటుంబాలకు ఒక ఎన్యూమరేటర్, పది మంది ఎన్యూమరేటర్ లకు ఒక సూపర్వైజర్, అలాగే మండల ప్రత్యేక అధికారులను జిల్లా స్థాయి నోడల్ అధికారులు పర్యవేక్షిస్తారని తెలిపారు. అదే విధంగా జిల్లాలో పది శాతం రిజర్వ్ తో 1156 ఎన్యుమరేటర్ లు, 116 సూపర్వైజర్ లు, 12 మంది మండల ప్రత్యేక అధికారులు, మున్సిపాలిటీలో మొత్తం 30వార్డులకు ఐదుగురు ప్రత్యేక అధికారులను కేటాయించామని వివరించారు. ప్రతి ఇంటికి స్టికర్‌లు తప్పనిసరిగా అతికిస్తామన్నారు. ఎన్యుమెరేటర్‌లకు, సూపర్వైజర్‌లకు శిక్షణ ఇచ్చామని, బుధవారం 65,064 కుటుంబాలను సర్వే చేసి సమాచారం సేకరించామన్నారు. ఇందులో భాగంగా పార్ట్-1 లో కుటుంబ యజమానికి సంబంధించిన కులం, మొబైల్ నంబర్, విద్య, ఉపాధి, కులవత్తులు, ఆదాయం, పన్ను, భూములు, బ్యాంకు ఖాతాలు, విద్య, ఉపాధిలో పొందిన రిజర్వేషన్, పొందిన పథకాలు, రాజకీయ నేపథ్యం, వలసలు ఇలా వివరాలు సేకరిస్తామని అన్నారు. పార్ట్-2 లో కుటుంబ వివరాలకు సంబంధించిన పొందిన రుణాలు, వ్యాపారాలు, నివాసం, స్థిర, చరాస్తి, తదితర వివరాలను సేకరిస్తామని, జిల్లా ప్రజలందరూ రేషన్, ఆధార్, ధరణి, పొలిటికల్‌కు సంబంధించిన పత్రాలను మాత్రమే చూస్తామని, ఎటువంటి ప్రలోభాలకు గురికావొద్దని, ప్రజల వివరాలన్నీ గోప్యంగా ఉంచుతామని, స్వేచ్ఛగా తమ వివరాలను తెలపాలని కోరారు.

అదే విధంగా ప్రజల్లో అపోహలను తొలగించి, చైతన్యపరచాలని, తమకు సహకరించాలని పాత్రికేయులకువిజ్ఞప్తి చేశారు. ఎక్కడైనా ఏదైనా సమస్య తలెత్తితే తమ దృష్టికి వెంటనే తీసుకురావాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసంబంధాల అధికారి పల్లవి, అదనపు పౌరసంబంధాల అధికారి శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

రబీలో చివరి ఆయకట్టు వరకు సాగునీరందించాలి : ఎమ్మెల్యే కడియం

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్



వచ్చే రబీ సీజన్ లో చివరి ఆయకట్టు వరకు సాగు నీరందించాలని మాజీ ఉపముఖ్యమంత్రి స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు శ్రీహరి అన్నారు. గురువారం కలెక్టరేట్లోని ప్రధాన సమావేశ మందిరంలో కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్, అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్,ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులు ఎగ్జిక్యూటివ్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని కాలువలు పూర్తయినంతవరకు సాగునీరు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. అశ్వరావుపల్లి రిజర్వాయర్ మెయిన్ కెనాల్, స్టేషన్ ఘనపూర్ నుండి నవాబుపేట వెళ్లే మెయిన్ కెనాల్ వరకు డిస్ట్రిబ్యూటరీస్ లో ఉన్న పూడిక తీత పనులను, నవాబుపేట రిజర్వాయర్ కింద ఉన్న ఆయకట్టు పనులు, గండి రామారాం లిఫ్ట్ ఇరిగేషన్ పనులు, ప్యాకేజీ6 కింద చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రిజర్వాయర్ వద్ద జంగిల్ క్లియరెన్స్, పూడిక తీత పనులు, కాలువల బలోపేతం, మరమ్మతు పనులను 15 రోజుల్లో పూర్తిచేయాలని సంబంధిత ఏజెన్సీలకు సూచించారు. డిసెంబర్ నెలలో అన్ని రిజర్వాయర్ల కింద ఉన్న చెరువులను నింపే కార్యక్రమం చేపట్టాలన్నారు. జనవరి మొదటి వారంలో అన్ని పంటలకు సాగునీరు అందించే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. అంతేకాకుండా ఈ నెల చివరలోపు ధర్మసాగర్, ఆర్ఎస్ ఘనపూర్, అశ్వరావుపల్లి, నవాబుపేట గండిరామారం మొదలగు రిజర్వాయర్లలో వాటి సామర్థ్యం మేరకు దేవాదుల నుండి నీటిని ఎత్తిపోసి పూర్తిస్థాయిలో నింపాలన్నారు. ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేయాలని సూచించారు.

కుటుంబ సర్వేను పకడ్బందీగా చేపట్టాలి : జెడ్పీ సీఈవో

నవతెలంగాణ-ఖానాపురం

మండలంలో జరుగుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను పకడ్బందీగా నిర్వర్తించాలని, ప్రతి కుటుంబాన్ని సందర్శించి డోర్లపై స్టిక్కర్లు అంటించాలని జెడ్పి సీఈవో రామ్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి సౌజన్య అన్నారు. ఈ సందర్భంగా వారు మండల కేంద్రంతోపాటు బుధరావుపేట, రంగాపురం గ్రామాలలో జరుగుతున్న కుటుంబ సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న ప్రతి కుటుంబాన్ని సందర్శించి డోర్లపై స్టిక్కర్లు అంటించి సందర్శించిన తేదీ స్టిక్కర్‌పై నమోదు చేయాలని సూచించారు. 9వ తేదీ నుండి ఎనుమరేటర్స్ సహకారంతో నిర్ణయించిన సమయంలో సర్వే పూర్తి చేసి కుటుంబాన్ని సందర్శించి సర్వే చేసిన తేదీని స్టిక్కర్లపై నమోదు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమాలలో ఎంపీడీవో ఈగల భరతి, తహసిల్దార్ కిరణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు అభేద బేగం, దోమల రజిత, సట్ల సుప్రజ, సిబ్బంది పాల్గొన్నారు.



నల్లబెల్లి : సమగ్ర కుటుంబ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని, గ్రామాలలో సిబ్బంది సకాలంలో స్టిక్కరింగ్‌ను వెంటనే పూర్తి చేయాలని వరంగల్ సీఈవో రామ్‌రెడ్డి అన్నారు. మండలంలోని గ్రామాల్లో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా స్టిక్కరింగ్ విధానాన్ని ఆయన పరిశీలించి ఈ నెల 9వరకు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వరంగల్ సిపిఓ గోవిందరాజన్, ఎంపీడీవో నరసింహమూర్తి, ఏఎస్ఓ, గ్రామ కార్యదర్శి ధర్మేందర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : కుల గణన సర్వేలో ఎన్యుమరేటర్లు ఎలాంటి తప్పులు లేకుండా సరిచూసుకోవాలని మండల ప్రత్యేక అధికారి ఎం.నీరజ సూచించారు. మండలంలోని అనంతారం, గోపనపల్లి, కొంకపాక గ్రామాల్లో ఇంటింటికి స్టిక్కర్లు, ఇంటి యజమాని వివరాలు ఎన్యూమరేటర్లు ఎలా నమోదు చేస్తున్నారు అని పరిశీలించారు.

కార్యక్రమంలో ఎంపీడీఓ మాలోతు శంకర్ నాయక్, ఎంపీఓ పాక శ్రీనివాస్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు దివ్య, పాషా, సదానందం, ఎన్యూమరేటర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

దళితులు ఐక్యంగా ఉంటేనే రాజ్యాధికారం : మాలమహానాడు

నవతెలంగాణ-కాశిబుగ్గ

దళితులు ఐక్యంగా ఉంటూ రాజ్యాధికారం దిశగా పయనించాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దళితుల ఐక్యత కోరుతూ నిర్వహిస్తున్న మాలల మహాపాద యాత్ర గురువారం వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చేరుకుంది. ఈ సందర్భంగా కాశిబుగ్గలోని అంబేడ్కర్ విగ్రహానికి మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లిసుధాకర్ నేతలతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 16జిల్లాలు 35నియోజకవర్గాల మీదుగా మాలల మహాపాద యాత్ర జరుగుతున్నట్లు తెలిపారు. అశాస్త్రీయమైన వర్గీకరణను నిలిపివేసి, మాలలపై జరుగుతున్న కుట్రలు మాను కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బొల్లం రామ్ కుమార్, కొమ్ము శ్రీకాంత్, ఊసిల్ల ఉదయ్, పెరుమండ్ల రవి, శంకర్, పాపారావు, సంజీవ, రఘు, అంకుస్, రవికుమార్, బండి రజనీ కుమార్, ముడుసు నరసింహ, దాసరి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

రాబోయే తరాలకు విజ్ఞానాన్ని అందించాలి

జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి శశిధర్‌రెడ్డి



నవతెలంగాణ-కాశిబుగ్గ

రాబోయే తరాలకు మనం విజ్ఞానాన్ని అందించే విధంగా ఉండాలే తప్ప మూఢనమ్మకాల పట్ల విశ్వాసాన్ని కలిగించేలా ఉండకూడదని జన విజ్ఞాన వేదిక వరంగల్ జిల్లా కార్యదర్శి డాక్టర్ సామల శశిధర్‌రెడ్డి అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఖిలా వరంగల్ మండల కేంద్రంలో జరుగుతున్న పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ కేంద్రాలను గురువారం శశిధర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక యుగంలో సైతం మూఢనమ్మకాల పట్ల ప్రజలు విశ్వాసంతో ఉండడం దురదృష్టకరమన్నారు. మూఢనమ్మకాలను ప్రజలు నమ్మవద్దన్నారు. మంత్రాలు తంత్రాలు క్షుద్ర పూజలు అంటూ గ్రామాల్లో పట్టణాల్లో చివరికి జిల్లా కేంద్రంలో సైతం ఇలాంటి వార్తలు రావడం పట్ల శశిధర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల స్థాయిలో నిర్వహించిన పరీక్షల్లో మొదటి స్థానం నిలిచిన విద్యార్థులకు ఈ నెల 21న జరిగే మండల స్థాయి పరీక్షల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. పరీక్ష నిర్వహణకు సహకరించిన ఖిలా వరంగల్ మండల పాఠశాలల యాజమాన్యాలకు జన విజ్ఞాన వేదిక తరపున శశిధర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఎంబీభవన్ హైదరాబాదులో సీసీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గం సమావేశం



నవతెలంగాణ-జనగామ

మాకినేని బసవపున్నయ్య సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర పార్టీ కార్యాలయంలో గురువారం జనగామ జిల్లా పార్టీ కార్యదర్శి వర్గం సమావేశమయ్యారు. సీపీఐ(ఎం) పార్టీ కార్యాలయంలో సమావేశమైన రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం జిల్లాలోని సమకాలీన రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, కార్యదర్శి వర్గ సభ్యులు ఇర్రి అహల్య, రాపర్తి రాజు, సింగారపు రమేష్, రాపర్తి సోమయ్య, బొట్ల శేఖర్‌లు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేను పరిశీలించిన అదనపు కలెక్టర్

నవతెలంగాణ-లింగాలఘణపురం



ఇంటింటాసర్వేలో భాగంగా అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్ లింగాల గణపురం మండల పరిషత్ కార్యాలయంను గురువారం సందర్శించడం జరిగింది. హౌస్‌లిస్టింగ్‌లో భాగంగా గ్రామాలోని కుటుంబాలను గుర్తించి ఇంటింటికి స్టికర్ వేయడంపై ఆకస్మిక తనిఖీ చేయడం జరిగింది. లింగాల ఘనపురం, బండ్లగుడెం జీడికల్ గ్రామాలలో జరుగుచున్న హౌస్ హెూల్డ్ సర్వేను తనఖీ చేయటం జరిగించి. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి జలందర్ రెడ్డి, మండల తహసిల్దార్ అండాలు, మండల పంచాయతీ అధికారి,రఘురామకృష్ణ, ఎంఈవో విష్ణుమూర్తి పాల్గొన్నారు.

జీడికల్ బ్రహ్మోత్సవాల ఏర్పాటుపై సమీక్ష

నవతెలంగాణ-లింగాలఘనపురం

జీడికల్ శ్రీవీరాచల జీడికంటి శ్రీ రామచంద్రస్వామి దేవస్థానంలో ఈనెల 14వ తేదీ నుండి జరగబోయే బ్రహ్మోత్సవాల కొరకు జీడికల్ దేవస్థానం దగ్గర జరగబోయే పనుల గురించి అధికారులు గురువారం సమీక్షించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనగామ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ కొల్లూరి నర్సింహులు (శివకుమార్), ఆర్డిఓ గోపి, ఇన్చార్జి ఎమ్మార్వో అండాలు , దేవస్థాన ఈవో చిందం వంశీ , దేవస్థాన చైర్మన్ ఏలే మూర్తి , మార్కెట్ కమిటీ డైరెక్టర్ నీలం మోహన్ , ఫిషర్మెన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్టల రాజు, ఓబిసి జిల్లా నాయకులు బెజ్జం ఆంజనేయులు , దేవస్థాన డైరెక్టర్లు సంపత్, శ్రీశైలం, నరేష్ , జీడికల్ గ్రామ శాఖ అధ్యక్షుడు కొండబోయిన రాజు, ఆలయ సిబ్బంది తదిరులు ఉన్నారు.

పాఠశాలల అభివృద్ధికి, ఉన్నతికి సహకరించాలి

నవతెలంగాణ-పర్వతగిరి

పాఠశాలల అభివృద్ధికి, ఉన్నతికి దాతలు సహకరించాలని మండల విద్యాశాఖ అధికారి గాయపు లింగారెడ్డి కోరారు. మండలంలోని అనంతారం ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో గతంలో ఉపాధ్యాయురాలుగా పని చేసిన శ్రీదేవి 30కుర్చీలను వితరణ చేశారు.ఈ సందర్భంగా ఆమెను అభినందించారు. అనంతరం శ్రీదేవిని పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి ఘనసత్కారం చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. పాఠశాలకు వితరణ చేయడం గొప్పగుణమని, సమాజంలో అందరూ తమవంతు బాధ్యతగా ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి, ఉన్నతికి సాయం చేయడానికి ముందుకు రావాలని ఆయన కోరారు. అనంతరం ఆయనను హెచ్‌ఎం శివశంకర్ సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధులకు వైద్య పరీక్షలు

నవతెలంగాణ-చెన్నారావుపేట

మండల కేంద్రంలోని వయోవృద్ధ సంఘం అధ్యక్షులు ఈగ సత్యనారాయణ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. గురువారం మండల కేంద్రంలోని శివాలయంలో డాక్టర్ సరోజన నేతృత్వంలో వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ సరోజ మాట్లాడుతూ వయో వృద్ధులు ధైర్యంగా వుండాలని, వయస్సు పైబడిన వారికి శరీరంలో మార్పులకు అనుగుణంగా వుండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ క్లబ్ అధ్యక్షులు ఈగ సత్యనారాయణ ప్రధాన కార్యదర్శి ములుక సాంబయ్య, వరంగంటి మల్లయ్య,గట్ల కష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-పర్వతగిరి

నెక్కొండ మండలం సాయిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు వర్ధన్నపేట మండలంలోని ఇల్లందలో ఉంటున్న తమ బిడ్డ ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా దారి తప్పి వడ్లకొండ ఎస్సీ కాలనికి చేరుకుంది. దీంతో కాంగ్రెస్ నాయకులు స్పందించి 100కు ఫోన్ చేసి తక్షణమే పర్వతగిరి పోలీసులకు సమాచారం అందించారు. వృద్ధురాలి కుమారుడికి సమాచారం అందించి స్వంత ఇంటికి చేర్చారు. కార్యక్రమంలో వడ్లకొండ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అత్తి కుమారస్వామి, సొసైటీ మాజీ డైరెక్టర్ రంగయ్య, నరుకుడు రవీందర్, వల్లందాస్ చిన్న రంగయ్య, నరకుడు కుమారస్వామి, జుట్టుకొండ రాజు తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్ ఫోన్లు బాధితులకు అందజేత

నవతెలంగాణ-నెక్కొండ

మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న ఇద్దరు బాధితులకు ఎస్ఐ మహేందర్ రెండు సెల్ ఫోన్లను అందించారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న క్రమంలో సిఈఐఆర్ పోర్టల్ నీ వినియోగించి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా విచారణ అనంతరం సెల్ఫోన్లను గుర్తించి రికవరీ చేసినట్లు ఎస్సై చెప్పారు. రికవరీ చేసిన రెండు ఫోన్లను బుక్య చిన్ని, గోపగాని శ్యాంసుందర్లకు గురువారం స్టేషన్లో అప్పగించారు. ఈ ఏడాది మొత్తం 72ఫోన్లు పోయిన ఫిర్యాదు మేరకు పోర్టల్ వినియోగించి ఫోన్లను గుర్తించి బాధితులకు అందించామన్నారు. మొబైల్ ఫోన్‌లు అందుకున్న బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ మేళా

నవతెలంగాణ-నర్సంపేట

ప్రభుత్వ పెన్షన్‌దారులు వారి డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ కోసం పెన్షన్ ఆఫీసులకు, బ్యాంకులకు వెళ్లకుండా తమ ఇంటివద్దనే పోస్ట్‌మాన్ ద్వారా లైఫ్ సర్టిఫికేట్ జారీ చేస్తామని నర్సంపేట సబ్ డివిజనల్ ఇన్స్పెక్టర్ సుచేందర్, సబ్‌పోస్ట్ మాస్టర్ సురేష్ తెలిపారు. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ద్వారా కేవలం రూ.70ల ఛార్జీతో ఆధార్ అనుసంధాన బయో మెట్రిక్ ద్వారా పూర్తి కాగిత రహిత లైఫ్ సర్టిఫికేట్ పోస్ట్‌మాన్ ద్వారా ఇంటి వద్దనే తీసీకొనే అవకాశం సదుపాయం తీసుకొస్తున్నామని చెప్పారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ పెన్షన్‌దారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, ఈ సర్టిఫికెట్ల కోసం పెన్షన్‌దారులు వారి పీపీఓ నెంబర్, బ్యాంక్ ఖాతా బుక్, ఈపీఎఫ్ ఐడీ, మోబైల్, ఆధార్‌కార్డు తదితర వివరాలు తెలియజేయాలని సూచించారు. ఇందుకోసం ఈ నెల 8న సబ్ పోస్ట్ కార్యాలయంలో డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాల కోసం పోస్ట్‌మాన్‌ను లేదా నర్సంపేట పోస్ట్ఆఫీసును సంప్రదించాలని కోరారు.

సీపీఐ(ఎం) మండల సభలను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-మహబూబాబాద్

సీపీఐ(ఎం) జిల్లా మూడో మహాసభలను జయప్రదం చేయాలని, ప్రజా కళాకారుల ప్రదర్శనలో పాల్గొనాలని ప్రజానాట్య మండల జిల్లా కార్యదర్శి నక్క సైదులు కళాకారులకు పిలుపు నిచ్చారు. గురువారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పెరుమాళ్ల జగన్నాథ భవన్‌లో పిఎన్ఎం సమావేశం అలవాల రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సైదులు



ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ నవంబర్ 16,17న సీపీఐ(ఎం) మహబూబాబాద్ జిల్లా మూడవ మహాసభలో జరగబోతున్న నేపథ్యంలో ప్రజా కళాకారులు పాల్గొని ప్రదర్శనలు ఇవ్వాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ సభ్యులు నూనె శ్రీనివాస్, బోర స్వామి, సంఘ నాగరాజు, మచ్చ వెంకన్న, నరేందర్, హరిత, మల్లేష్, రాజు పాల్గొన్నారు

సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి

ఎంఈవో శ్రీనివాస్

ఉపాధ్యాయుడు రమేష్ సేవలు ఆదర్శనీయం

నవతెలంగాణ-పెద్దవంగర

ప్రతి ఒక్కరు సేవా దక్పథాన్ని అలవర్చుకోవాలని మండల విద్యాధికారి బుధారపు శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని అవుతాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు గంగిశెట్టి రమేష్ కుమార్ తన సొంత డబ్బులతో పాఠశాల విద్యార్థులకు టై, బెల్టులు అందజేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కళాధర్



అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దాతలు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సహకరించాలన్నారు. విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రామ్మోహన్ రవి, శ్రీను, నరసింహారావు, శ్రీనివాస్, సురేందర్, సింహాద్రి, సమ్మయ్య, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీకి 'ఐనాల' రాజీనామా

నవతెలంగాణ-మరిపెడ



బహుజన్ సమాజ్ పార్టీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి, డోర్నకల్ అసెంబ్లీ ఇంచార్జ్ పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు ఐనాల పరశురాములు గురు వారం ఒక ప్రకటనలో తెలి పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నేండ్లుగా పార్టీ నిర్మాణానికి పగలు, రాత్రి శ్రమించి శక్తి వంచన లేకుండా కృషి చేశానని, ప్రస్తుత పరిస్థి తులు, కొన్ని అనివార్య కారణాలతో పార్టీని వీడుతున్నట్లు తన రాజీనామా లేఖను రాష్ట్ర అధ్యక్షులు మంద ప్రభాకర్‌కు పంపానని తెలిపారు. ఇన్నేండ్లుగా నాతో కలిసి పనిచేసి నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇక నుండి రాజకీయాలు కాకుండా సేవభావంతో అందరి మధ్యనే ఉంటానని తెలిపారు.

తొర్రూరు మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా తిరుపతిరెడ్డి బాధ్యతలు

నవతెలంగాణ-తొర్రూరు



తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో చైర్మెన్‌గా హనుమాండ్ల తిరుపతిరెడ్డి గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు కాంగ్రెస్ శ్రేణులు శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డికి ఘన స్వాగతం

తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి హాజరైన పౌర సరఫరాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డిని కాంగ్రెస్ నాయకులు భారీ ర్యాలీగా వెళ్లి వారికి గజమాలతో ఘన స్వాగతం పలికారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని వినతి

నవతెలంగాణ-కురవి

మండల కేంద్రంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మాలోతు కిషన్‌నాయక్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా అధికారులు



స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కిషన్‌నాయక్ మాట్లాడుతూ ఆయా గ్రామాలలో, తండాలలో, కరెంట్ వైర్లు లూజ్‌గా ఉన్నాయని, స్తంభాలు విరిగిపోయి ఉన్నాయని, నాణ్యమైన కరెంటు అందడంలేదని, రైతులకు నాణ్యమైన కరెంటు లేదని, ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు.కార్యక్రమంలో సంబంధించిన అధికారులు కురవి మండల ఏఈ శారద, లైన్ ఇన్‌స్పెక్టర్ తదితరులు అధికారులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో గిరిజనేతరులకు అభివృద్ధి పనులు ఇవ్వొద్దు : తుడుందెబ్బ

నవతెలంగాణ-కొత్తగూడ

తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ఏజెన్సీ ఏరియాకు కేటాయిస్తున్న నామినేట్, టెండర్ అభివృద్ధి పనులను స్థానిక నిరుద్యోగ ఆదివాసీ యువతకు ఇవ్వాలని, గిరిజనేతరులకు ఇవ్వొద్దనితుడుందెబ్బ రాష్ట్ర కో కన్వీనర్ ఆగబోయిన రవి అన్నారు. గిర్జనేతర కాంట్రాక్టర్లు తమ డబ్బు, పలుకుబడితో ఇంజనీరింగ్ అధికారులను మచ్చిక చేసుకొని గుట్టుచప్పుడు కాకుండా వర్క్‌ఆర్డర్స్‌ను పొంది ఏజెన్సీ ఏరియాలో ప్రభుత్వం కేటాయిస్తున్న అభివృద్ధి పనులను ఆదీవాసులకు అందనీయకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధి కోసం వచ్చే పనులను ఇకనైనా స్థానిక ఆదివాసీలకు కేటాయించి నాణ్యతా ప్రమాణలు పాటిస్తూ అధికారుల పర్యవేక్షణలో పనులు చేయించాలని కోరారు.

అక్రమ వ్యాపారుల నుంచి రైతులను కాపాడాలి

సీపీఐ మరిపెడ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ

నవతెలంగాణ-మరిపెడ

అక్రమ వ్యాపారాలను కొనసాగిస్తూ జీరో దందాలతో రైతులను పీల్చి పిప్పి చేస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి మారగాని బాలకష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ మరిపెడ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం మరిపెడ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ మాట్లాడుతూ మండల కేంద్రంలో మరిపెడ చుట్టూ ఉన్న గ్రామాలలో రైతులకు చేతికి వచ్చిన పంట పత్తి, వరి



ధాన్యాలను గ్రామాలలో కొంత మంది దళారులుగా మారి పత్తిని ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా జీరో వ్యాపారం చేస్తు 6200-6400 పత్తిని కోమగోలు చేసుకుంటూ కనీసం సీసీఐ మద్దతు ధర 7500 ఇవ్వకుండ రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. మండల కేంద్రంలో షాపులను ఏర్పాటు చేసుకొని ఎటువంటి అనుమతులు లేకుండా పత్తిని కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు.కొన్ని గ్రామాలలో ఐకెపి సెంటర్లు లేని చోట వ్యాపారులు ధాన్యం కొనుగోలు కూడా ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర కంటే తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. కాబట్టి వీటినన్నింటిపై తగు చర్యలు తీసుకోని రైతులకు న్యాయం చేయాలని కోరుచున్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఎండి రషీద్,కర్ణ,వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

హార్డిల్స్ రాష్ట్రస్థాయి పోటీలకు సాద్విక ఎంపిక

నవతెలంగాణ-పెద్దవంగర



80 మీటర్స్ హార్డిల్స్ పరుగు రాష్ట్ర స్థాయి పోటీలకు పెద్దవంగర జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని సాద్విక ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఎంఈవో బుధారపు శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 4న ఉమ్మడి వరంగల్ జిల్లా ఎస్జీఎఫ్ పోటీల్లో ఆమె ద్వితీయ స్థానంలో నిలిచి, రాష్ట్ర స్థాయికి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఈ నెల 15, 16, 17 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో సాద్విక పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థిని సాద్విక తో పాటుగా, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు కంచర్ల ప్రభాకర్‌ను ఎంఈవో అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు విద్యుత్ కనెక్షన్లు త్వరగా అందించాలి

అన్నదాతలకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేపట్టాలి

పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలి

జిల్లాలో ఇంటిగ్రేటెడ్ హై స్కూల్స్, రెండు పడకల గదుల నిర్మాణం కోసం ప్రతిపాదనలు వెంటనే పంపాలి

రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-తొర్రూరు



పాలకుర్తి నియోజకవర్గం, తొర్రూర్ మండల కేంద్రంలో గురువారం రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడి విస్తతంగా పర్యటించారు. దంతాలపల్లి మండలం కేంద్రంలోని సహకార శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం జనగామ, మహబూబాబాద్ జిల్లాల కలెక్టర్లు సంబంధిత అధికారులతో కలిసి తొర్రూరులోని మిషన్ భగీరథ అతిథి గృహంలో అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ధాన్యం కొనుగోలు సన్నరకం, దొడ్డు రకం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాలను నిర్వహించాలని, సన్న రకాలకు సర్టిపై చేసి కొనుగోళ్లు చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలలో రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు త్వరగా మంజూరు చేయాలని, పాలకుర్తి పరిధిలోని ఇరిగేషన్ రిజర్వాయర్లు, కెనాళ్లు, ఏదైనా మరమ్మతులు ఉంటే వెంటనే చేయాలన్నారు. కొత్త పనులకు అవసరం ఉన్న చోట ప్రతిపాదనలు పంపాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో పంచాయతీరాజ్, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం విభాగాలలో పెండింగ్లో ఉన్న పనులు,ను వెంటనే పూర్తి చేయాలని, సిసి రోడ్లకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలన్నారు.

మహబూబాబాద్, జనగామ జిల్లా పరిధిలో ఇంటిగ్రేటెడ్ ఉన్నత పాఠశాలల మంజూరు కోసం స్థల సేకరణ చేసి ప్రతిపాదనలు వెంటనే పంపాలని సంబంధిత కలెక్టర్లను ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో భూ ఆక్రమణాలను గుర్తించి సంబంధిత వారికి నోటీసులు అందించి చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో రెండు పడకల గదుల నిర్మాణం ఎన్ని సిద్ధంగా ఉన్నాయో గుర్తించి పంపిణీకి సిద్ధం చేయాలని, మిగతా అవసరమైన రెండు పడకల గదులకు నిర్మాణం కు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. క్షేత్రస్థాయిలో అన్ని శాఖల అధికారులు ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ నిత్యం అందుబాటులో ఉండాలని అధికారులను ఆదేశించారు. అధికారులు విధులలో ఎలాంటి నిర్లక్ష్యం చేయకూడదని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు అందించే సేవలపై ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ల సూచనల మేరకు విధులు నిర్వహించాలని మంత్రి అధికారులను సూచించారు. ప్రజలకు విద్యుత్, త్రాగునీరు, విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత అధిక ప్రాధాన్యత కల్పించాలని మంత్రి కలెక్టర్లకు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో వరంగల్, మహబూబాబాద్ ఎంపీలు కడియం కావ్య, పోరిక బలరాంనాయక్, ప్రభుత్వవిప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోతు రామచంద్రనాయక్, ఎమ్మెల్యేలు హనుమండ్ల యశస్వినిరెడ్డి, డాక్టర్ భూక్య మురళినాయక్, మహబూబాబాద్, జనగామ జిల్లా కలెక్టర్లు అద్వైత్ కుమార్‌సింగ్, రిజ్వాన్‌బాషాషేక్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహించాలి

మరిపెడమండల 9వ మహాసభలో...

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్

నవతెలంగాణ-మరిపెడ



పాలకవర్గాలు ప్రజలను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా పీల్చి పిప్పి చేస్తూ దోపిడీకి గురి చేస్తున్నాయని, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహించాలని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని గుండెపూడి గ్రామంలో 9వ మహాసభ సీతారామ ఏచూరినగర్, తూము మల్లయ్య ప్రాంగణంలో జిన్నా లచ్చయ్య అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ మహాసభలకు ముందుగా పార్టీ జెండాను సీనియర్ నాయకులు పుల్లూరు దేవయ్య ఎర్రజండాను ఎగర వేశారు. అనంతరం పార్టీ ఉద్యమంలో పనిచేసీ అమరులైన అమరవీరులకు సంతాపం తెలిపి వారికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభ కు ముఖ్య అతిథులుగా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, నిర్మాణ బాధ్యతలు అలవాల వీరయ్యతో కలిసి జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు.

దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించకుండా పాలక ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయని ఆయన ఎద్దేవా చేశారు. గత పది ఏళ్ల నుండి కేంద్రంలో పాలిస్తున్న నరేంద్ర మోడీ ప్రజల కష్టాలను తీర్చకపోగ, కొన్ని మత సంస్థలకు వంతపాడుతూ జపం చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఇన్ని నెలల కాలంలో నిరుద్యోగులకు ఏమిచ్చిందని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఊరూరా తలంబ్రాల బియ్యం పంపించి ప్రజల మనోభావాలను చదరగొట్టిన బిజెపి చివరికి అయోధ్యలో చిత్తుగా ఓడిపోయిందని గుర్తు చేశారు. దేశ ఆర్థిక సంపదను సంపన్న వర్గాలకు తాకట్టు పెడుతున్నారని. దేశ సంపదను దోచుకొని దాచుకున్న వారికి కొమ్ము కాస్తూ వారికి రక్షణ వలయంగా నరేంద్ర మోడీ ఉన్నారన్నారు. రాష్ట్రంలో ఎన్నో ఆశలతో ప్రభుత్వాన్ని ప్రజలు అధికారంలోకి తీసుకురాగా ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఆశలతో రేవంత్‌రెడ్డి ప్రజలను ఉరిస్తున్నారని అన్నారు. రానున్న కాలంలో ప్రజా వ్యతిరేక విధానాలకు ఎండగట్టి ప్రజా పోరాటాలు నిర్వహించడానికి మహాసభలు దోహదపడతాయని పిలుపునిచ్చారు. జిల్లాలో ఇప్పటికే 151 శాఖ సమావేశాలు పూర్తి చేసుకొని, దాదాపుగా అన్ని మండల మహాసభలు ముగింపు దశలో ఉన్నట్లు వివరించారు. సమావేశంలోఖమ్మం జిల్లా నాయకులు నవీన్‌రెడ్డి, తిరుమలాయపాలెం మండల కార్యదర్శి కొమ్ము శ్రీనివాస్, ఖమ్మం అర్బన్ మండల కార్యదర్శి బత్తిని ఉపేందర్, సిపిఐ (ఎం) మరిపెడ మండల నాయకులు దుండి వీరన్న, బాణాల రాజన్న, నందిపాటి వెంకన్న, కందాల రమేష్, గుండగాని మధుసూదన్, బోడపట్ల రాజశేఖర్, షరీఫ్, అల్లి శ్రీనివాస్‌రెడ్డి, మౌలానా, కొండ ఉప్పలయ్య, మరిపెడ (బంగ్లా)టౌన్ కార్యదర్శి దొంతు సోమన్న, పాల్వాయి దుర్గయ్య, అనంతచారి తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ ఏకపక్ష నిర్ణయాన్ని ఖండిస్తున్నాం

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ మల్లారెడ్డి

నవతెలంగాణ-మహబూబాబాద్



జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి నియామకంలో జిల్లా విద్యాశాఖాధికారి ఏకపక్ష నిర్ణయాన్ని టీఎస్ యూటీఎఫ్ ఖండిస్తున్నదని రాష్ట్ర కార్యదర్శి ఎస్ మల్లారెడ్డి అన్నారు. గురువారం మహబూబాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర విద్యా శాఖ నిర్వహించిన సెక్టోరియల్ ఆఫీసర్-2 పరీక్షలో మన జిల్లాలో నలుగురు ఉపాధ్యాయులు అర్హత సాధించినట్లు తెలిపారు. అందులో ఒక టీచర్ జాయిన్ కాగాకొద్ది రోజులు విధులు నిర్వహించిన తర్వాత మళ్లీ తిరిగి తన పాఠశాలకు వెళ్లాడు. మిగితా ముగ్గురు అర్హత సాధించిన ఉపాధ్యాయులను పరిగణలోనికి తీసుకోకుండానే పరీక్ష రాయని వారిని ఏకపక్షంగా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్‌గా నియమించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఒకరి పేరునే కలెక్టర్‌కు సిఫార్సు చేసినట్లు తెలిసిందన్నారు. దీన్ని టీఎస్ యూటీఎఫ్ జిల్లా శాఖ తీవ్రంగా ఖండిస్తున్నదని,ఒకవేళ నియమించాలని అనుకుంటే పరీక్ష రాసిన వారిని, ఆసక్తి, అర్హత ఉన్న అందరినీ నుండి ధరఖాస్తులు స్వీకరించి అందులో నుండి సెలెక్ట్ చేయాలని డిమాండ్ చేశారు. గత డీఈఓ డిసీఈబీ నియామకంలో చేసిన తప్పులను మళ్లీ చేయొద్దని, నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారిని నియామంచాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఏ మురళీకష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కె యాకూబ్, జిల్లా కోశాధికారి కె నాగమల్లయ్య, మండల బాధ్యులు జి సంజీవ, కె శ్రీనివాస్, ఎం ప్రవీణ్ కుమార్, కె రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాలు ప్రారంభం

నవతెలంగాణ మహబూబాబాద్



పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను గురువారం కంకరబోర్డు జెడ్పీహెచ్ఎస్‌లో జన విజ్ఞాన వేదిక మహబూబాద్ మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. పాఠశాల హెచ్ఎం మాలోత్ కోట్య మాట్లాడారు, పిల్లలు శాస్త్రీయ దక్పథాన్ని అలవర్చుకోవడానికి జన విజ్ఞాన వేదిక పని చేస్తుండడం మంచి అవకాశమని, చెకిముకి పరీక్ష ప్రారంభోత్సవం తమ పాఠశాలను ఎన్నుకోవడం హర్షణీయమని, సీనియర్ సభ్యులు, రిటైర్డ్ ప్రిన్సిపల్, ప్రతాపని మంగపతి రావు మాట్లాడుతూ విద్యార్థులను ఉద్దేశించి, సైన్స్ అనేది వాస్తవమని, నమ్మకానికి వాస్తవానికి తేడా ఉంటుందని, అర్థం చేసుకోవడానికి శాస్త్రీయ దక్పథం అవసరమని అన్నారు. అనంతరం రాష్ట్ర బాధ్యులు తడకమల్ల బ్రహ్మం, యర్రంరెడ్డి ఉమాదేవి, సీనియర్ పూర్వ అధ్యక్షులు, మైస నాగయ్య మహబూబాద్ జిల్లా అధ్యక్షులు, సాహితీ శ్రీనివాస్, ఆరోగ్య పర్యావరణ కన్వీనర్, జంపాల యాకయ్య, మహబూబాద్ మండల అధ్యక్షులు, బండి నరేందర్ రెడ్డి, మహబూబాద్ మండల ప్రధాన కార్యదర్శి, రాధారపు సునీత, సీల్డ్ పరీక్ష పత్రాలను పిల్లల ముందు తెరిపించి, పరీక్ష నిర్వహించారు. ఇంకా ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

తొర్రూరు : విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి చెక్కుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ ఉపయోగపడుతుందని తొర్రూర్ మండల విద్యాశాఖ అధికారి మహంకాళి బుచ్చయ్య అన్నారు. జనవిజ్ఞాన వేదిక తొర్రూరు మండల అధ్యక్షులు తాళ్లపల్లి రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం పాఠశాల స్థాయిలో చెకుముఖి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశ్నపత్రాల విడుదల, స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పాఠశాల ప్రిన్సిపల్ విజయ రత్నమాల అధ్యక్షత నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఈఓ సీల్డ్ కవర్లో ఉన్న ప్రశ్నాపత్రాలు జెవివి మండల అధ్యక్షులు రమేష్, జెవివి జిల్లా ఉపాధ్యక్షులు రాయిపల్లి యాకయ్య, ప్రిన్సిపల్ విజయ రత్నమాలలతో కలిసి రిలీజ్ చేశారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపల్ మౌనిక, ఉపాధ్యాయులు జన విజ్ఞాన వేదిక తొర్రుర్ ప్రధాన కార్యదర్శి కోటగిరి కుమార్, కోశాధికారి ఎద్దు వెంకన్న, చెకుముకి కన్వీనర్ ముత్తులింగం తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన మంత్రి పొంగులేటి

నవతెలంగాణ-దంతాలపల్లి

మండల కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన దాన్యం ఏ గ్రేడ్ రకానికి రూ.2320, సాధారణ రకానికి రూ.2300 అందేలా, సన్న రకం ధాన్యానికి అదనంగా రూ.500 రూపాయలు చెల్లించుటకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. రైతులకు



ఎలాంటి నష్టం జరగకుండా ప్రభుత్వం లక్ష్యం ప్రకారం వరి కొనుగోలు జరగాలని సంబంధించిన అధికారులకు సూచించారు. ధాన్యం విక్రయించిన రైతుల కు వివరాలు ట్యాబ్‌లో వెంటనే నమోదు చేయాలని సూచించారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తొలగించడం జరుగుతుందని హెచ్చరించారు. గురువారం మంత్రి పరిశీలనలో నిర్వహణ పనితీరు సక్రమంగా లేదని, వారిని తొలగించి వెంటనే వేరే వారిని నియమించాలని సంబంధిత అధికారులకు సూచించారు. మంత్రి వెంట ప్రభుత్వవిప్, డోర్నకల్ నియోజకవర్గం ఎమ్మెల్యే రామచంద్రనాయక్, పిఎసిఎస్ చైర్మన్ సంపేట రాము గౌడ్, తహసిల్దార్ చంద్ర రాజేశ్వర్, సీఈవో టి. వెంకన్న రైతులు పాల్గొన్నారు.

యన్ఏయస్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి : డీఈవో

నవతెలంగాణ-కొత్తగూడ

ప్రభుత్వ పాఠశాల 3,6,9విద్యార్థుల కోసం నిర్వహించే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (యన్ఏయస్) పరీక్షలను జిల్లాలో పక్షబందిగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖధికారి రాజేశ్వర్ అన్నారు. మండలంలో వెలుబెల్లి, పోలారం కేజీబీవీ, యూపీఎస్‌కొత్తగూడ పాఠశాలలను గురువారం తనిఖీ చేశారు. ఆయా పాఠశాలలో విద్యా ర్థుల సామార్థ్యలను



పరిశీలించారు. కేజీబీవీ పోలారం పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల సామార్థ్యలు మెరుగుపడేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. అనంతరం యన్ఏయస్ మాదిరి పరీక్ష పత్రాలను 6,9 తరగతులకు వివరించారు. డిసెంబర్ నెలలో జరిగే యన్ఎయస్ పరీక్షల్లో ఇప్పడి నుండే విద్యార్థులను సంసిద్ధులను చేయాలని సూచించారు. ఇప్పటి వరకు 3మాక్ టెస్టులు నిర్వహించారు. ఈ నెల 8న పాఠశాలల్లో నిర్వహించే నాల్గో యన్ఏయస్ మాక్ టెస్ట్ చివరిదని, కాబట్టి విద్యార్థుల ప్రతిభ పత్రాలను రికార్డులను నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంఓ ఆజాద్, ఎంఈవో గుమ్మడి లక్ష్మి నారాయణ, సిఆర్‌పి ఉపేందర్ పాల్గొన్నారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి బానోతు సీతారాం నాయక్

నవతెలంగాణ-మహబూబాబాద్

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి బానోతు సీతారాంనాయక్ అన్నారు. గురువారం మహబూబాబాద్ మున్సిపాలిటీ ఏటీగడ్డతండా 9వ శాఖ సమావేశం వాంకుడొతు హతీరాం అధ్యక్షతన జరిగింది. ఈ మహా సభను ఉద్దేశించి పట్టణ కార్యదర్శి బానోతు సీతారాం నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం



ప్రకటించిన 6గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలి డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ నిధులను దారి మళ్లించకుండా స్థానిక సమస్యల పరిష్కారానికి విడుదల చేయాలని కోరారు స్థానిక సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే ఎంపీ నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పట్టణంలో ఇండ్లు వేసుకొని నివసిస్తున్న వాళ్లకు ఇంటి నెంబర్‌ను వెంటనే ఇవ్వాలని కోరారు. పార్టీ నూతన శాఖ కార్యదర్శిలను ఎన్నుకున్నారు. పార్టీ ఏటీగడ్డ తండా నూతన శాఖ కార్యదర్శిగా బానోతు ప్రకాష్, సహాయ కార్యదర్శిగా బానోతు సుమన్ నాయక్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజామౌళి, 1టౌన్ ఏరియా కమిటీ సభ్యులు రావుల రాజు, పట్టణ నాయకులు హేమనాయక్, నాయకులు బానోతు సిజ్జిరాంనాయక్, వాంకువాతు రాములు భూక్య దయాకర్, గుగులోతు చిన్న తదితరులు పాల్గొన్నారు.

రావుల రాజుకు ఘన సన్మానం

నవతెలంగాణ-మహబూబాబాద్

చిర్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక ఏసుక్రీస్తు మందిరం ప్రాంగణంలో గురువారం మల్లెపాక తిమోతి అధ్యక్షతన సిపిఎం పార్టీ టౌన్ వన్ ఏరియా కమిటీ కార్యదర్శి రావుల రాజుకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం అనంతరం



చిర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50మంది వృద్ధులకి దుప్పట్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎల్బీజీ నగర్ శాఖ కార్యదర్శి బడుగుల లక్ష్మయ్య కాలనీవాసులు చిర్స్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వీధి కుక్కల వీరంగం

నవతెలంగాణ-ఇనుగుర్తి

మండల పరిధిలోని చిన్న ముప్పారం గ్రామంలో వీధి కుక్కలు వీరంగం సష్టించాయి. గురువారం ఉదయం సమయంలో గ్రామ విద్యుత్ శాఖ హెల్పర్ హెడ్లోజు శేఖర్, కాలేరు హరీష్, ముంజంపల్లి పూలమ్మను వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. దీంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో సైతం కుక్కల దాడులకు వరుస సంఘటనలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ అధికారులు తక్షణమే స్పందించి నివారణ మార్గాలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

'ధర్మయుద్ధం' విజయవంతం చేయాలి

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రమేష్ మాదిగ

నవతెలంగాణ-పెద్దవంగర

మాదిగల ధర్మ యుద్ధం మహాసభను విజయవంతం చేయాలని మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు చాగంటి రమేష్ మాదిగ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో తొర్రూర్ డివిజన్ ఇంచార్జ్ మంద యాకమల్లు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీల వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆ తీర్పును అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధత ఏబీసీడీ వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలన్నారు. వర్గీకరణ చేసిన తర్వాతనే రాష్ట్రంలో ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాబోయే రోజుల్లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మధుసూదన్, చంద్రమౌళి, మహేష్, ఐలయ్య, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలి

తాహసీల్దార్, ఎంపీడీఓ



నవతెలంగాణ- గణపురం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సర్వేను పకడ్బందీగా వేగవంతంగా పూర్తి చేయాలని తాసిల్దార్ సత్యనారాయణ స్వామి, ఎంపీడీవో ఎం భాస్కర్ అన్నారు గురువారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న హౌస్ లిస్టింగ్ సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి డోర్ స్టిక్కర్ అంటించి సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. సర్వేలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలన్నారు మొదటి దశలో ఇంటింటికి స్టిక్కర్లు అంటించిన అనంతరం సర్వే మొదలు పెట్టాలన్నారు.

50 వృక్షాలకు 'కాట్లు' ?

బాధ్యులపై అధికారులు చర్యలు తీసుకోవాలి
చిన్నతూండ్ల గ్రామస్తుల వినతి







నవతెలంగాణ-మల్హర్‌రావు

ఒకవైపు వన మహోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్విరామంగా కొనసాగిస్తుంటే మరోవైపు పదేండ్ల కిందట గత ప్రభుత్వం హరితహారం కార్యక్రమంలో భాగంగా వేల రూపాయలు ఖర్చు చేసి మొక్కలు నాటింది. నేడు అవి పెరిగి పెద్దవయ్యాక కొందరు వ్యక్తులు నరికే ప్రయత్నం చేస్తున్నారు. అయినా ఆర్‌అండ్‌బీ, అటవీశాఖశాఖ అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం. ఇందుకు జయశంకర్-భూపాలపల్లి జిల్లా మల్హర్‌రావు మండలంలోని చిన్నతూండ్ల గ్రామంలోని చెట్లే నిదర్శనం. మల్హర్‌రావు మండలం చిన్నతూండ్ల గ్రామంలో ఆరేవాగు బ్రిడ్జి నుంచి దాదాపు 2కిలోమీటర్ల మేర తారు రోడ్డుకు ఇరువైపులా పంట పొలాల మీదుగా పెద్దతూండ్ల గ్రామం శివారు వంకు అటవీశాఖ ఆధ్వర్యంలో వందలాది మొక్కలు పదేండ్ల కిందట నాటారు. అవి ప్రస్తుతం వృక్షాలై రైతులకు, ప్రజలకు, ప్రయాణికులకు చల్లని నీడనిస్తూ సేదతీరుస్తున్నాయి. రోడ్డుపై పచ్చని పందిరిలా పరుచుకపోవడంతో ఇరు గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు దాదాపు 50 వృక్షాలకు చుట్టూ గొడ్డలితో చెట్లు చనిపోయేలా కాట్లు పెట్టారు. గతంలో ఇలా కొన్ని చెట్లకు కాట్లు పెట్టిన నేపథ్యంలో చెట్లు ఎండిపోయి చనిపోయినట్టు చిన్నతూండ్ల గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వక్షాలను నరికి చంపే ప్రయత్నం చేస్తున్న సదరు వ్యక్తులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ ఘటనపై ఆర్‌అండ్‌బీ అధికారులను సంప్రదించే ప్రయత్నం చేయగా అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.

ఆ చెట్ల బాధ్యత ఆర్‌అండ్‌బీ అధికారులదే

ఆర్‌అండ్‌బీ రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి వాటికి రెండు సంవత్సరాల వరకు సంరక్షణ చర్యలు చేపట్టే బాధ్యత మాత్రమే అటవీశాఖ అధికారులకు ఉంటుంది. తరువాత ఆ చెట్లపై పూర్తి సంరక్షణ చర్యలు చేపట్టే బాధ్యత ఆర్‌అండ్‌బీ అధికారులదే. అదే పంచాయతీ రోడ్లకు ఇరువైపులా అయితే పంచాయతీ రాజ్‌శాఖ అధికారులదే బాధ్యత. ఈ విషయంలో ముమె చేయలేం.

-రాజేశ్వర్‌రావు, కొయ్యూర్ ఫారెస్ట్ రేంజర్

ఆర్టిజన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ
జిల్లా కమిటీ నాయకులు మోత్కూరి కోటి

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

విద్యుత్ సంస్థలో పని చేస్తున్న ఆర్టిసన్ కార్మికులను రెగ్యులర్ పోస్టులోకి కన్వర్షన్ ఇవ్వాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ భూపాలపల్లి కమిటీ నాయకులు మోత్కూరి కోటి అన్నారు. గురువారం కాటారం మండల కేంద్రంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకు విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం అందజేశారు. మోత్కూరి కోటి మాట్లాడుతూ.. తెలంగాణ విద్యుత్ సంస్థలో 18 సంవత్సరాల పైబడి విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తామని మాజీ ముఖ్యమంత్రి కేశఈసార్ హామీ ఇచ్చి విస్మరించారన్నారు. విద్యుత్ సంస్థలోని కార్మిక సంఘాలు కాంట్రాక్టు కార్మికులు 2016లో ఉద్యమం చేయగా కె.సి.ఆర్ పర్మినెంట్ చేస్తామని చెప్పి 2017 లో కార్మికుల ను విలీనం చేస్తూ ఆర్డర్ ఇచ్చారన్నారు. మరుసటి రోజు కొంత మంది నిరుద్యోగులు కోర్టులో కేసు వేశారన్నారు. ఆ కేసు ఆర్టిజన్ కార్మికులు చందాల ద్వారా డబ్బులు జమ చేసి కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కేసు వాదించుకున్నామన్నారు. రాష్ట్ర అత్యున్నతమైన న్యాయస్థానం నుండి 2018 లో అనుకూలంగా తీర్పు వచ్చిందనీ అన్నారు. కాంట్రాక్టు కార్మికులను ఇండస్ట్రియల్ డిస్ప్యూట్ యాక్టు ప్రకారం పర్మినెంట్ చేసుకొనే వేసులు బాటును విద్యుత్ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వానికి కల్పిస్తూ తీర్పు ఇచ్చిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల లెక్కలలో అసెంబ్లీలో విద్యుత్ సంస్థలో 23,667 మందిని పర్మినెంట్ చేస్తామని, చేయకుండా మొదటి ఆర్డర్ను రద్దుచేశారన్నారు. ఒక్కొ సబ్ స్టేషన్లలో 5గురు చేయాల్సిన పనిని ఇద్దరు, ముగ్గురితో చేపిస్తున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తులసి గిరి సమ్మయ్య, చందా సతీష్, నారుమళ్ళ రవి, ధనుష్ ,విద్యాసాగర్, సుధాకర్, వేణు, తదితరులు పాల్గొన్నారు.

సివి రామన్‌ను సూర్తిగా తీసుకోవాలి

నవతెలంగాణ-మహదేవపూర్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం ములుగుపల్లి ఉన్నత పాఠశాలలో ప్రముఖ సైన్స్ శాస్త్రవేత్త నోబెల్ బహుమతి గ్రహీత సివి రామన్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రతి విద్యార్థి రామన్ ను స్ఫూర్తిగా తీసుకొని గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలని మండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాశం సంజీవరెడ్డి అన్నారు. భారతదేశం గర్వించదగ్గ గొప్ప సైన్స్ శాస్త్రవేత్త సివి రామన్ మాత్రమేనని అన్నారు. ప్రతి విద్యార్థి సైన్స్ పట్ల మక్కువ పెంచుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులు శాస్త్రీయ వైఖరులు, పరిజ్ఞానాన్ని పెంచుకొని భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. ప్రతి సంవత్సరం విద్యార్థుల్లో సైన్స్ పట్ల అభివ ద్ధి పెంచే విధంగా జనవిజ్ఞాన వేదిక సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహించడం అభినందనీయం అన్నారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో చెకుముకి సైన్ సంబరాలలో భాగంగా పాఠశాల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలోపాఠశాల ఉపాధ్యాయులు దాసరి రాజేంద్రప్రసాద్, ఏ.అనిల్ నాయక్, సకరాంనాయక్, కామిడీ సతీష్ రెడ్డి,.ఎస్ చంద్రకళ, పి .ఈటి వెంకటేష్ సిఆర్పి బాపు రెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

గొర్రెల కాపర్లపై ఫారెస్ట్ అధికారుల దౌర్జన్యం

నవతెలంగాణ-మహదేవపూర్

మహాదేవపూర్ మండలంలోని రాపల్లికోట గ్రామాన్ని చెందిన కొంతమంది మేత కోసం గొర్రెలకాపర్లు పలివెల మండలంలోని బూరుగుడెం గ్రామానికి వలస వెళ్లారు. రాత్రివేళ గొర్రెల రక్షణ కోసం గొర్రెల చూట్టూ వలలు వేసుకొని ఉన్నారు. గురువారం తెల్లవారుజామున కొంతమంది ఫారెస్ట్ అధికారులు వచ్చి అడివిలో వరిని అడిగి వలలు జాలీలు పెట్టుకున్నరని దుర్భాషలాడారని, వలలు, జాలీలు పీకి వేసి దౌర్జన్యం చేశారని గొర్రెల కాపర్లు ఆరోపించారు. అనంతరం రాపల్లి కోట గ్రామానికి వెళ్లి ఫారెస్ట్ అధికారులతో మాట్లాడి జాలీలు వలలు తీసుకున్నామని తెలిపారు. మేత కోసం వలస వెళ్లిన మమ్ములను ఫారెస్ట్ అధికారులు దౌర్జన్యం చేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. ఇటువంటి సంఘటనలు జరిగితే ధర్నాలు రాస్తారోలు చేపడతామని యాదవ సంఘాలు హెచ్చరించాయి.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-రేగొండ

రేగొండ మండలంలోని నారాయణపురం గ్రామంలో ఇటీవల గణపాక సూరమ్మ మ తి చెందగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదేశాల మేరకు గురువారం వారి కుటుంబాన్ని కాంగ్రెసు జిల్లా నాయకులు బలే రావు మనోహర్ రావు పరామర్శించి, ఓదార్చి 2000 రూపాయల ఆర్థిక సాయంని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కుల సాధనకు పోరాడాలి సీఐటీయూ

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

కార్మికుల హక్కులకై పోరాటం చేయాలని సీఐటీయూ నాయకులు వెలిశెట్టి రాజయ్య అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్మిక భవనంలో భూపాలపల్లి మున్సిపాలిటీలో పనిచేస్తున్న 25మంది ట్రాలీ వర్కర్స్ వెలిశెట్టి రాజయ్య, బంధు క్రాంతి ఆధ్వర్యంలో సీఐటీయూ యూనియన్‌లో చే రారు. వారిని యూనియన్‌లోకి ఆహ్వానించి రాజ య్య మాట్లాడారు. పనిగంటలు, వేతనాల పెంపు, కార్మికుల అభివృద్ధికి పోరాటం చేయాలని కోరారు. నాయకులు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇండ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వాలి

సిపిఎం పార్టీ ములుగు టౌన్ కార్యదర్శి ఎండి సద్దాం హుస్సేన్



నవతెలంగాణ - ములుగు

డబల్ బెడ్ రూమ్ ఇండ్లు పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు ఇవ్వాలని సీపీఐ(ఎం) ములుగు టౌన్ కార్యదర్శి ఎండి సద్దాం హుస్సేన్ తెలిపారు. ములుగు మండల కేంద్రంలో నిర్మాణంలో ఆగిపోయిన డబ్బులు బెడ్ రూమ్ ఇండ్లను పార్టీ టౌన్ కమిటీ గురువారం పరిశీలించింది. ఎండి సద్దాం హుస్సేన్ పాల్గొని మాట్లాడుతూ మండల కేంద్రంలో సుమారు 100 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మాణ మధ్యలో ఆగిపోయినట్టు చెప్పారు. మండల కేంద్రంలో అనేకమంది పేద ప్రజలు ఇండ్ల కిరాయిలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మండల కేంద్రంలో ఎలాంటి పరిశ్రమలు లేక ఉపాధి దొరకక పేద ప్రజలు ఉండడానికి ఇల్లు లేక ఇబ్బంది పడతున్నారని అన్నారు. మండల కేంద్రంలో నిర్మాణంలో ఆగిపోయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను మొత్తం సరైన నాణ్యత ప్రమాణాలతో పూర్తిచేసి లబ్ధిదారులను ఎంపిక చేసి ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం మండల కేంద్రంలో ఉన్న పేదలను గుర్తించి ఇందిరమ్మ ఇండ్లు ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ ములుగు టౌన్ నాయకులు కలవల రవీందర్, రత్నం ప్రవీణ్, జన్ను దేవేందర్, కోర్ర రాజు, తదితరులు పాల్గొన్నారు.

17వ వార్డు టెండర్ అయిన పనులు ప్రారంభించాలి

ఎమ్మెల్యేను కోరిన వార్డు కౌన్సిలర్ మురళి



నవతెలంగాణ -కోల్ బెల్ట్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సుభాష్ కాలనీ 17వ వార్డు పరిధిలో గత ప్రభుత్వ హయాంలో టెండర్ అయిన పనులు మొదలు పెట్టించాలని వార్డు కౌన్సిలర్ ముంజంపల్లి మురళీధర్ స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుని కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని రాంనగర్ లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యేని మురళి కలిసారు. వార్డులో మిగిలిన పలు అభివృద్ధి పనులు, సమస్యలు ఎమ్మెల్యేకి వివరించారు. సుభాష్ కాలనీ రామాలయం ముందు నుంచి భారత్ గ్యాస్ గోదాం వరకు ఉన్న పాత రోడ్డు అధ్వాన్నంగా తయారైందని, వాహనాలు వెళ్ల లేని పరిస్థితికి చేరిందని తెలిపారు. ఈ రోడ్డు పనుల కోసం మాజీ ఎమ్మెల్యే రమణారెడ్డి హయాంలో ఒక కోటి 25 లక్షలతో నిధులు మంజూరు అయి, టెండర్ అయి ఉన్నందున పనులను త్వరగా ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మురళి వెంట గుర్రాల రామస్వామి, శ్రీపతి రవీందర్‌గౌడ్, కట్ట నరసింహ చారి, గాజా రాములు, చుక్క బాలారాజు గౌడ్, రావుల పోశం, అనసూయ గణేష్, వంగల మోహన చారి, భూక్య శ్రీ రామ్ తదితరులు ఉన్నారు.

విలువలతో కూడిన వైద్య సేవలు అందించాలి

జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర్



నవతెలంగాణ - ములుగు

రోగులను ఆప్యాయతతో పలకరిస్తూ విలువలతో కూడిన వైద్య సేవలను అందించాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ సమీక్ష సమావేశం ములుగు కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, ఆర్బిఎస్కే ప్రోగ్రాం డాక్టర్లతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. అత్యవసర నిమిత్తం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఏమైనా పరికరాలు , అవసరం ఏంటూ వాటిని కొనుగోలు చేసి వైద్య సేవలు అందించాలన్నారు. వాటికి బడ్జెట్ అందజేయడం జరుగుతుందని తెలిపారు. వైద్యశాఖ చేస్తున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై,ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరును తెలుసుకున్నారు. నిర్దిష్టమైన ప్రణాళికతో, ఒక కాల పరిధిని ఎంచుకొనీ కార్యక్రమాలను ముందుకు తీసుకుపోయి లక్ష్యాలను సాధించాలని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి గోపాలరావు మాట్లాడుతూ ఆరోగ్యంతో బాధపడుతున్న వారు టెలీ మానస్ ఫోన్ కాల్‌ను వినియోగించుకోవాలని అన్నారు. పాఠశాల విద్యార్థులకు మానసిక ఆరోగ్యం పట్ల అవగాహన కార్యక్రమాలు చేయాలని సూచించారు. మహిళల ఆరోగ్య సమస్యలపైఅవగాహన కల్పిస్తూ వైద్య సేవలు అందించాలని కోరారు. జిల్లా ఉపవైద్యాధిక శాఖ అధికారి విపిన్ కుమార్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ పవన్ కుమార్, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ రణధీర్, డాక్టర్ భవ్యశ్రీ, జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలకు మహర్దశ తీసుకొస్తా...

వసతులు కల్పించకుంటే చర్యలు

జిల్లా గ్రంథాలయాల చైర్మన్
బానోతు రవిచందర్



నవతెలంగాణ-మంగపేట

మంత్రి సీతక్క చొరవతో పాటు రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో జిల్లాలోని గ్రంథాలయాలకు మహర్దశ తీసుకొస్తానని జిల్లా గ్రంథాలయాల చైర్మన్ బానోతు రవి చందర్ అన్నారు. గురువారం మండలానికి వచ్చిన ఆయన మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రంథాలయ నిర్వహణ రికార్డులను పుస్తకాల రిజిస్టర్‌ను పాఠకుల నమోదు రిజిస్టర్ ను పరిశీలించారు. పాఠకుల సంఖ్య తక్కువగా ఉందని పాఠకులను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రంథాలయ నిర్వహకుడు లక్ష్మీపతికి ఆదేశించారు. మండల కేంద్రంలో గ్రంథాలయం ఉందనే విషయం ప్రజలకు తెలియకుండా పోయిందని గ్రామాల్లో ఉన్న నిరుద్యోగులకు మంగపేటలో గ్రంథాలయం ఉందనే విషయాన్ని తెలిసేలా చేయాలని అన్నారు. మంచినీటి వసతులను కల్పించడం తోపాటు సమయానికి అనుకూలంగా తేనీరు కూడా ఇవ్వాలని తెలిపారు. నిర్వహణలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. గ్రంథాలయాల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం గ్రంథాలయం గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తుండడంతో నిర్వహణకు సరిపోవడం లేదని అన్నారు. గ్రంథాలయ నిర్వహణ కోసం ప్రత్యేక భవనం మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానిక యువకులు రవిచందర్‌కు వినతి పత్రాన్ని అందించారు. స్పందించిన ఆయన మంత్రి సీతక్క దృష్టికి తీసుకువెళ్లి నూతన భవనంలోకి గ్రంథాలయం మార్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం గ్రంథాలయాల చైర్మన్ హోదాలో మొదటి సారి మండలానికి వచ్చిన రవిచందర్ ను కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా సన్మానించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండలశాఖ అధ్యక్షుడు మైల జయరాం రెడ్డి నాయకులు అయ్యోరి యానయ్య, చెట్టుపల్లి వెంకటేశ్వర్లు హిదాయతుల్లా ముత్తినేని ఆదినారాయణ ట్రావెల్స్ శ్రీనివాస్, పగిడిపల్లి వెంకటేశ్వర్లు మురుకుట్ల నరేందర్ ఇస్సార్ ఖాన్ కర్రీ నాగేంద్రబాబు తదితరులు ఉన్నారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట : రవిచందర్



నవతెలంగాణ-మంగపేట

రాష్ట్రం ప్రగతికాంక్షించే కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్ అన్నాడు. గురువారం మండలానికి వచ్చిన ఆయన మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మండలంలోని వివిధ గ్రా మాలకు చెందిన అర్హులైన 26 మంది లబ్ధిదా రులకు ఒక లక్ష నూట పదహారు రూపాయల విలువ చేసే ఒక్కో చెక్కును అందజేశారు. అనం తరం రవి చందర్ మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలను దశల వారీగా అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందని అన్నాడు. డిప్యూటీ తహసిల్దార్ మల్లేశ్వరరావు కాం గ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మై ల జయరాం రెడ్డి నాయకులు అయ్యోరి జానయ్య చెట్టుపల్లి వెం కటేశ్వర్లు హిదాయతుల్లా ముత్తినేని ఆదినారాయణ పగిడిపల్లి వెంకటేశ్వర్లు, ఇస్సార్ ఖాన్, కర్రీ నాగేం ద్రబాబు జగన్మోహన్ రెడ్డి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నాసిరకంగా డబుల్ రోడ్డు పనులు : సీపీఐ(ఎం)



నవతెలంగాణ -ములుగు

ములుగు మండలం కాసిందేవిపేట గ్రామం నుండి అంకన్నగూడెం గ్రామం వరకు ప్రారంభమైన డబుల్ రోడ్డు నిర్మాణ పనులు నాసిరకంగా చేపడుతున్నారని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఎండి గఫూర్ పాషా ఆరోపించారు. గురువారం పార్టీ మండలకమిటీ ప్రతినిధి బృందం గ్రామ రోడ్డును పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోడ్డు పనులు ప్రారంభమై 20 రోజులు అవుతుందన్నారు. దాదాపుగా రెండు కిలోమీటర్ల దూరం కంకర పోయడం పూర్తయిందనీ, ఇప్పటివరకు ఒక్క చుక్క నీళ్ళు కూడా పోయలేదని అన్నారు. ఈ రోడ్డు నుండి సర్వాపురం, అంకన్నగూడెం, పెగడపల్లి, రాయినిగూడెం, కొత్తూరు, పంచోత్కలపల్లి గ్రామపంచాయతీల పరిధి గ్రామాల వరి ధాన్యం ఈ రోడ్డు నుండే రావాల్సి ఉందని తెలిపారు. ఒక్కో లారీలో సుమారుగా 600 నుంచి 700 బస్తాల లోడుతో లారీలు వస్తాయని అన్నారు. ఇలా నీళ్ల పోయకుండా రోలింగ్ చేయకుండా ఒకే రోజు మోరి(కల్వర్ట్) తీసి వేయడం జరుగుతుందని అన్నారు. భవిష్యత్తులో రోడ్డు కుంగిపోయే ప్రమాదం ఉందని, ఇలా గతంలో నిర్మించిన కన్నాయిగూడెం, దేవగిరి పట్నం, గ్రామాల మధ్య ఉన్న మోరీల వద్ద గుంతలు పడ్డాయని గుర్తు చేశారు. మండల వ్యాప్తంగా పందికుంట క్రాస్ నుండి పందికుంట గ్రామం వరకు కంకర పోసి రెండు నెలలు దాటినా ఇప్పటివరకు పనులు పూర్తి కాలేదని అన్నారు. రామచంద్రపురం నుండి శ్రీనగర్ క్రాస్ వరకు కంకర పోసి అనేక రోజులు గడుస్తున్నా రోడ్డు పనులు పూర్తి కాలేదని, అలాగే ములుగు నుండి అన్నం పెల్లి, దేవగిరిపట్నం, కాసిందిపేట వరకు రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయని అన్నారు. వెంటనే అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు. గుండెబోయిన రవి గౌడ్, జన్ను దేవేందర్, శోభన్, గట్టు నారాయణ, గడ్డం సర్వేశం, శ్యామల రమేష్,ఈసం ముత్తారావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి...

కాంగ్రెస్ జిల్లా నాయకులు బాబురావు

నవతెలంగాణ- రేగొండ

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా రేగొండ మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ జిల్లా నాయకులు పుల్లూరి బాబురావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదేశాల మేరకు 8వ తేదీ శుక్రవారం రోజున తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ రక్తదాన శిబిరాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. భూపాల్ పల్లి 100 పడకల హాస్పిటల్ సూపరింటెంట్ డాక్టర్ నవీన్ సమక్షంలో ఎంజీఎం సిబ్బంది రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న గుడ్ లైఫ్ స్కూల్ ఆవరణంలో ఉదయం 9 గంటలకు రక్తదాన శిబిరం ప్రారంభమవుతుందని తెలిపారు. రక్తదాన శిబిరానికి యువత అధిక సంఖ్యలో తరలివచ్చి రక్తదానం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

జర్నలిస్టు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా, అక్రిడేషన్ రాష్ట్ర కమిటీమెంబర్‌గా ప్రమోద్ కుమార్

నవతెలంగాణ-మహాదేవపూర్

జర్నలిస్టు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా, అక్రిడేషన్ రాష్ట్ర కమిటీ నెంబర్‌గా మహాదేవపూర్‌కు చెందిన సీనియర్ పాత్రికేయులు, ఎస్ ప్రమోద్ కుమార్ ఎన్నికయ్యారు. గురువారం ఉత్తర తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర కమిటీ పక్షాన, పీక కిరణ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల కోసం పోరాటం చేశారని గుర్తు చేశారు. మహదేవపూర్ కాటారం మహముత్తారం, పలిమెల, మలహర్ మండల జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా ఉపాధ్యాయుడికి వీడ్కోలు

నవతెలంగాణ-మొగుళ్ళ పల్లి

మండలంలోని నర్సింగపూర్ ప్రైమరీ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేసి ఎంపీయూపీఎస్ మెట్టుపల్లి పాఠశాలకు బదిలీపై వెళ్లిన కొత్తూరి అంకూస్ ను తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు గురువారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. నసిరోద్దీన్ అధ్యక్షతన జరిగిన వీడ్కోలు సమావేశానికి ఎంఈఓ కుమారస్వామి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తు తరగతి గది నాలుగు గోడల మధ్యనే తీర్చి దిద్దే వ్యక్తి ఉపాధ్యాయుడు మాత్రమేనన్నారు. ప్రతి వ త్తిలో బదిలీలు, పదవి విరమణలు తప్పని సరిగా ఉంటాయని తెలిపారు. విద్యార్థులు ఇష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బంగ్లాపల్లె హెచ్ ఎం క్రిష్టారెడ్డి,ఉపాధ్యాయులు రవిందర్, మాజీ సర్పంచ్ సతీష్, అమ్మ కమిటీ చైర్మన్ అనసూర్య గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన జిల్లా కబడ్డీ కమిటీ సభ్యులు

నవతెలంగాణ-మొగుళ్ళపల్లి

జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావును జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ పండుగ శ్రీనివాస్, చైర్మన్ తక్కళ్ళపల్లి రాజు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందించారు. క్రీడా సమస్యలు ఎమ్మెల్యే ద ష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించి కమిటీకి అన్ని విధాలుగా ఎల్లవేళలా సహాయసహకారాలు అందించి కబడ్డీ క్రీడా అభివ ద్ధి కోసం తన వంతు క షి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు కబడ్డీ అసోసియేషన్ కమిటీ సభ్యులు తెలిపారు.

సామాజిక ఆర్థిక కులగణన సర్వే పరిశీలన

నవతెలంగాణ-మహాదేవపూర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక సామాజిక కులగన్న సర్వే ఈనెల 6 నుండి ప్రారంభమైంది. రెండవ రోజు గురువారం మండల అధికారి వీరభద్రయ్య మహాదేవపూర్ బెగులూరు గ్రామపంచాయతీలో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. ప్రతి ఇంటింటికి వెళ్లి సర్వే చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీఓ ప్రసాద్, గ్రామ కార్యదర్శులు కల్పన, దామోదర్ ఉన్నారు

రంగవల్లి విజ్ఞాన కేంద్రం వాల్ పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ- ములుగు

రంగవల్లి అక్క విజ్ఞాన కేంద్రం వాల్ పోస్టర్ ఆవిష్కరణ ను ములుగు జిల్లా కేంద్రంలో గురువారం ఆవిష్కరించారు. అనంతరం పూర్వ పిడిఎస్యు ములుగు జిల్లా అధ్యక్షులు ముంజల బిక్షపతి గౌడ్ మాట్లాడుతూ రంగవెల్లి అక్క అమరులై 25 సంవత్సరాలు కావస్తున్నదన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ధ్రువతర ఉన్నత చదువులు చదివి ఉద్యమంలో చురుకుగా పాల్గొందన్నారు. నవంబర్ 11న వేములవాడ నంది కామన్ వద్ద రంగవల్లి విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవం ఉంటుందని అన్నారు. నాయకులు అరుణోదయ రాష్ట్ర నాయకులు బుల్లెట్ వెంకన్న పూర్వ పిడిఎస్యు జిల్లా నాయకులు పెండెం రాజేందర్, వైనాల రవి, దళిత బహుజన రైతుకుల సంఘం రాష్ట్ర నాయకులు జంగిలి రఘు, సారంగపాణి ,కవిత, సారయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలి

ఎంఎస్పిఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు

నవతెలంగాణ- మల్హర్ రావు/కాటారం

అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఎస్సీ వర్గీకరణ అమలులోకి తీసుకువచ్చిన తరువాతనే ఉద్యోగాలు భర్తీ చేయాలని ఎంఎస్పి, జాతీయ నాయకుడు మందకుమార్ మాదిగ,ఎమ్మార్పీఎస్, జాతీయ అధికార ప్రతినిధి బోర్ర భిక్షపతి మాదిగ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అనుబంధ సంఘాలు గురువారం కాటారం మండల కేంద్రంలోని జి, ఎల్, ఫంక్షన్ హాల్ మండల నిర్మాణ సదస్సు ఎమ్మార్పీఎస్ కాటారం మండల అధ్యక్షుడు మంతెనే చిరంజీవి మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి ఎస్సీ వర్గీకరణ అమలులో చేయడంలో దేశంలోనే తొలి రాష్ట్రంగా తెలంగాణను నిలబెడతామని ముఖ్యమంత్రి ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా 11వేల టీచర్ పోస్టులు భర్తీ చేసి మాదిగలకు ద్రోహం చేశాడన్నారు. తక్షణమే ఉద్యోగాల భర్తీ నిలిపివేయాలన్నారు. కాలయాపన చేయకుండా తక్షణమే ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ అమలు కోసం నవంబర్ రెండో వారంలో అన్ని నియోజక వర్గ కేంద్రాల్లో నిరాహార దీక్షలు చేపట్టాలని పిలుపునిచ్చారు. నవంబర్ 16న మాదిగల ధర్మయుద్ధ రథయాత్ర ప్రారంభమై రాష్ట్ర వ్యాప్తంగా నెల రోజుల పాటు కొనసాగుతుందన్నారు. డిసెంబర్ 21న లక్షలాది మందితో హైదరాబాద్ లో మాదిగల ధర్మయుద్ధ ప్రదర్శన నిర్వహిస్తామని జయప్రదం చేయాలన్నారు. ఎమ్మార్పీఎస్, జాతీయ మాజీ పోలిట్ బ్యూరో సభ్యులు బొడ్డు దయాకర్ మాదిగ, మున్నూర్ కాపు ఎంఎస్పీ, జాతీయ నాయకులు వేల్పుల సూరన్న, ఎంఎస్పి, జిల్లా ఇన్చార్జి అంబాల చంద్రమోగిలి, ఎంఎస్పీజిల్లా నాయకులు బొల్లి బాపు మాదిగ గాజుల బిక్షపతి మాదిగ నోముల శ్రీనివాస్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు దోర్నాల రాజేందర్ మాదిగ, మల్లేష్ పాల్గొన్నారు.